

జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్


REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com



**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690



సంపుటి : 4 | సంచిక : 306 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 20-05-2025 | పేజీలు : 6


# హైదరాబాద్, విజయనగరంలో వరుస పేలుళ్లకు కుట్ర!

- రంపచోడవరంలో రిహార్సల్స్ జరిపిన సిరాజ్, సమీర్
- 2 సార్లు సౌదీకి సిరాజ్.. రిమాండ్ రిపోర్టులో వెల్లడి
- రంగంలోకి ఎన్ఐఏ.. నిందితుల కస్టడీకి పిటిషన్



**హైదరాబాద్/విజయనగరం/ఆరిలోవ(విశాఖ), మే 19 (జనస్వరం) :** దిల్‌సుఖ్‌నగర్ జంటపేలుళ్ల మాదిరిగా.. హైదరాబాద్, విజయనగరంలో వరుస పేలుళ్లకు భారీ కుట్ర జరిగింది. పేలుళ్లకు అవసరమైన ఐఈడీల తయారీకి అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకున్నారు. అవసరమైన సరంజామాను ఆన్‌లైన్‌లో తెప్పించుకున్నారు. బాంబులను ఎలా పేల్చాలనేదానిపై రంపచోడవరం అడవుల్లో రిహార్సల్స్ చేశారు. సౌదీలో ఉండే ఉగ్రవాద నాయకుల ఆదేశాలతో.. పక్కా ప్రణాళికను అమలు చేసే ప్రయత్నంలో ఉండగా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులకు పట్టుబడ్డారు. ఆదివారం అరెస్టయిన విజయనగరానికి చెందిన సిరాజ్-ఉర్-రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్ రిమాండ్ రిపోర్ట్‌లో నిందితుల ఆర్థిక లావాదేవీలు సహా.. సంచలన విషయాలు వెల్లడయ్యాయి.

**బీటెక్ చదువుతుండగా పరిచయం :**

హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న సమయంలో సిరాజ్, సమీర్ ఒకరికొకరు పరిచయమయ్యారు. వీరిద్దరూ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్రవాద సంస్థ వైపు ఆకర్షితులయ్యారు. బీటెక్ పూర్తయ్యాక సమీర్ సికింద్రాబాద్‌లో లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేశాడు. ఈ క్రమంలో సౌదీలోని పలు ఉగ్రవాద సంస్థల హ్యాండ్లర్లతో సోషల్ మీడియాలో పరిచయం పెంచుకున్నాడు. సిరాజ్, సమీర్ సౌదీలోని ఐఎస్ హ్యాండ్లరు ఇచ్చే ఆదేశాలతో తెలుగురాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లోని ముస్లిం యువతను ఆకర్షించేందుకు అల్‌హింద్ ఇత్తేహాదుల్ ముస్లిమీమ్(అహిం) సంస్థను స్థాపించారు. సోషల్ మీడియాలో 'మ్యాజిక్ లాంతర్' పేరుతో ఖాతాను తెరిచి.. అహిం సంస్థలో సభ్యత్వాలిచ్చారు. అలా పదుల సంఖ్యలో యువకులు, మైనర్లను వీరు అహింలో చేర్చుకున్నారు. సౌదీలోని హ్యాండ్లర్ల ఆదేశాలతో హైదరాబాద్, విజయనగరంలో పేలుళ్లకు కుట్రలు పన్నారు. ఇందుకోసం సిరాజ్ రెండుసార్లు సౌదీ వెళ్లి వచ్చాడు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న వీడియోల నుంచి పేలుడు పదార్థాల తయారీ, వాటిని పేల్చడంపై శిక్షణ తీసుకున్నాడు. తమ వ్యూహాన్ని అమలు చేయడానికి ముందు సికింద్రాబాద్‌లోని సమీర్ ఇంట్లో అహింసభ్యులు మూడ్రోజుల పాటు భేటీ అయ్యారు.

**టిఫిన్ బాక్సు బాంబులు :**

సిరాజ్, సమీర్‌లు బాంబుల తయారీకి అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్, టిఫిన్ బాక్సులు, వైర్లు, రిమోట్ సెల్స్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. వీటిని స్థానిక దుకాణాల్లో కొనుగోలు చేస్తే.. పట్టుబడే ప్రమాదం ఉంటుందని అమెజాన్ వంటి ఈ-కామర్స్ సైట్లను ఎంచుకున్నారు. వాటితో బాంబులను తయారు చేశాక.. పరీక్షల కోసం రంపచోడవరం అటవీ ప్రాంతంలో పలుమార్లు రిహార్సల్స్ చేశారు. తొలుత డమ్మీ పేలుళ్లతో ప్రయత్నించి, ఆ తర్వాత హైదరాబాద్, విజయనగరంలో వరుస పేలుళ్లు జరపాలని కుట్రపన్నారు. జాతీయ బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తే.. నిఘా సంస్థలు గుర్తిస్తాయనే ఉద్దేశంతో సిరాజ్ విజయనగరం జిల్లా సహకార బ్యాంకులో ఖాతా తెరిచాడని, ఉగ్రవాద కార్యకలాపాలకు ఈ ఖాతా నుంచే లావాదేవీలు నిర్వహించాడని నిర్ధారించారు.

**రంగంలోకి ఎన్ఐఏ :**

ఉగ్ర కుట్ర కేసు కావడంతో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) రంగంలోకి దిగింది. సోమవారం విజయనగరానికి వస్తూనే.. స్థానిక దర్యాప్తు అధికారి నుంచి ప్రాథమిక సమాచారాన్ని రాబట్టింది. తెలుగు రాష్ట్రాలతోపాటు.. మహారాష్ట్ర, కర్ణాటకల్లోని అహిం సభ్యుల వివరాలపై ఆరా తీస్తోంది. సిరాజ్ తండ్రి, సోదరుడు పోలీసు శాఖకే చెందిన వారు కాగా.. వారినీ ఠాణాకు పిలిపించి విచారించినట్లు సమాచారం. అహిం నెట్‌వర్క్‌కు సౌదీలోని హ్యాండ్లర్లు ఎవరు? వారు పేలుళ్లకు నిధులను ఎలా పంపుతున్నారు? అనే కోణంపైనా ఎన్ఐఏ దృష్టిపెట్టింది.

**10 రోజుల కస్టడీకి ప్రయత్నాలు :**

విజయనగరం కోర్టు సిరాజ్, సమీర్‌లకు 14 రోజుల రిమాండ్ విధించడంతో పోలీసులు వారిని విశాఖ కేంద్ర కారాగారానికి తరలించారు. అక్కడ వీరిద్దరినీ వేర్వేరు ఐసోలేటెడ్ సెల్స్‌లో పెట్టి, పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. అటు పోలీసులు కూడా ఈ కేసులో వీరిద్దరినీ విచారించాల్సి ఉందని పేర్కొంటూ 10 రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు అనుమతిస్తే.. స్థానిక పోలీసులు, ఎన్ఐఏ విచారించనున్నట్లు తెలుస్తోంది. వీరిని అత్యంత రహస్యంగా విచారించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఉగ్ర కదలికలపై అప్రమత్తం

- సానుభూతి పరులను గుర్తించండి
- అనుమానితుల వివరాలు వెలికితీయండి
- సీఎస్, డీజీపీలకు డిప్యూటీ సీఎం లేఖలు



**అమరావతి, మే 19 (జనస్వరం) :** విజయనగరం జిల్లాలో ఉగ్రవాద సానుభూతి పరుడు సిరాజ్ ఉర్ రెహ్మాన్ అరెస్టు, అతనికి నిషేధిత ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్ర సంస్థతో సంబంధాలున్నాయని తేలడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర పోలీసులను అప్రమత్తం కావాలని సూచించారు. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉగ్రవాద కదలికలు, వారి సానుభూతిపరుల జాడలను గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ మేరకు పల సూచనలు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాలకు సోమవారం ఆయన లేఖలు రాశారు. ఇదే సమయంలో సాధారణ పరిపాలన శాఖకు కూడా పలు సూచనలు చేశారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం వచ్చిందని, దీనిపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. విజయనగరంలో సిరాజ్ అనే యువకుడికి ఐఎసతో సంబంధాలన్నాయని, పేలుళ్లకు కుట్ర పన్నిన విషయాన్ని తెలుగు రాష్ట్రాల నిఘా వర్గాలు గుర్తించి అరెస్టు చేసిన క్రమంలో కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించాలన్నారు. ఉగ్రవాద సానుభూతిపరులు, స్లీపర్ సెల్స్, అక్రమ వలసదారులు, రోహింగ్యాల ఉనికి, వారి కదలికలపై అన్ని జిల్లాల అధికారులు తక్షణం అప్రమత్తం కావాలన్నారు. ఎక్కడైనా ఉగ్రనీడలు, వారి జాడలు కనిపిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా తీర ప్రాంత జిల్లాల పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు.


**వారికి.. ఐడీలున్నాయా? :**

రాష్ట్రంలోని అక్రమ వలసదారులు, ఉగ్రవాద సానుభూతిపరులపై ఇప్పటి వరకు ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని అనుసరించి మరింత లోతుగా విచారణ చేపట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. గతంలో రాష్ట్రంలో ఏవైనా ఉగ్ర కార్యకలాపాలు జరిగి ఉంటే వాటిలో పాల్గొన్న వారిపై పూర్తిస్థాయి నిఘా అవసరమని తెలిపారు. ఉత్తరాంధ్ర, గోదావరి, మన్యం జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచి తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ లేఖలో రోహింగ్యాల విషయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గుంటూరుతో పాటు ఇతర జిల్లాల్లో రోహింగ్యాల ఉనికి ఉందని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. వీరిలో కొందరికి రేషన్, ఆధార్, ఓటర్ కార్డులు ఉన్నాయనే సమాచారం వస్తోందని, ఇది ఆందోళనకర పరిణామమని పేర్కొన్నారు. అనుమానితులు ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ మొదలైన గుర్తింపు కార్డులు కలిగి ఉన్నారా?. ఉంటే.. వీటిని వారు ఎలా పొందారు? వారికి ఆశ్రయం ఇచ్చిందెవరు? స్థానికంగా వారికి ఎవరు సౌకర్యాలు కల్పిస్తున్నారు? వారికి సహకరిస్తున్న వ్యక్తులు, సంస్థలను గుర్తించి విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు.

**జాతీయ, ప్రజల భద్రత ముఖ్యం :**

జాతీయ భద్రత, ప్రజల భద్రత అత్యంత ప్రాధాన్యంతాంశంగా పరిగణించి తక్షణం చర్యల తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. కొన్నేళ్ల కిందట గుంటూరు, గతేడాది రాయలసీమ ప్రాంతాల్లో ఎన్ఐఏ అధికారులు దాడులు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు ఆ విషయాలను గమనంలోకి తీసుకోవాలని సూచించారు. దేశ భద్రత, ప్రజల రక్షణ అనేవి అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నవని తెలిపారు. రాష్ట్ర పోలీసు యంత్రాంగం శాంతి భద్రతలతో పాటు అంతర్గత భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తేనే.. ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వ చర్యలకు రాష్ట్ర సహకారం తోడవుతుందని పేర్కొన్నారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 20 మే 2025,

తిథి : బహుళ సప్తమి (ఉ.05:55వ.కు), బహుళ అష్టమి (21తా తె.05:01వ.కు) నక్షత్రం : ధనిష్ఠ (రా.07:34వ.కు)

బ్రహ్మ ముహూర్తం : తె.04:04ల తె.04:52

రాహుకాలం : మ.03:17ల సా.0453,

యమగండం : ఉ.08:52ల ఉ.10:28,

వర్జ్యకాలం : 21తా తె.02:40ల తె.04:27

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 20 మే 2025,

ఫజర్ : తెల్లవారుజామున గం. 04:33

సూర్యోదయం : ఉదయం గం. 05:50

జొహర్ : మధ్యాహ్నం గం. 12:17

అసర్ : సాయంత్రం గం. 03:36

మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:42

ఇష : రాత్రి గం. 08:00





జన స్వరం

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను.. అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# జగన్ అరెస్టుకు టైం, డేట్, ప్లేస్ ఫిక్స్ ?

వైసీపీ అధినేత ఇంటి ముందు దాకా అరెస్ట్ వ్యవహారం వచ్చేసిందా అంటే జరుగుతున్న ప్రచారం చూస్తే అదే అనిపిస్తోందంటున్నారు. వైఎస్ జగన్ అరెస్ట్ తప్పదని, కొంతకాలంగా జరుగుతున్న ప్రచారం ఇప్పుడు నిజమయ్యే సూచనలు కనిపిస్తున్నాయంటున్నారు. జగన్ విషయానికి వస్తే ఏపీలో జగన్ ప్రభుత్వ హయాంలో లిక్కర్ స్కాం జరిగిందని పేర్కొంటూ కొంత కాలంలో పోలీసులు విచారిస్తున్నారు. మొదట సీఐడీ ఈ కేసుని డీల్ చేస్తూ వచ్చింది ఇక ఆ మీదట సిట్‌ని రంగంలోకి దింపారు. సిట్ వరసబెట్టి అనేక మంది నాయకులను విచారిస్తూ అరెస్టు చేస్తోంది. ఇక ఈ కేసులో జగన్ ప్రస్తావన ఎందుకు అంటే ఆయనకు అత్యంత సన్నిహితుడుగా ఉన్న రాజ్ కసిరెడ్డిని చాలా కాలం క్రితమే అరెస్ట్ చేసారు. దాంతో జగన్ చుట్టూనే ఈ కేసు తిరుగుతోందని అంతా ప్రచారం చేశారు. ఇక తాజాగా చూస్తే వైసీపీ హయాంలో పనిచేసిన ధనుంజయరెడ్డి, క్రిష్ణ మోహన్ రెడ్డిలను విచారించి మరీ అరెస్ట్ చేయడంతో ఈ కేసు ఏకంగా జగన్ వరకూ వచ్చేసినట్లేనని ప్రచారం చేస్తున్నారు. ఇక జగన్ విషయం తీసుకుంటే ఆయన మీద గతంలో సీబీఐ కేసులు నమోదు చేసింది. ఆదాయానికి మించి ఆస్తులను కూడ బెట్టారంటూ క్విడ్ ప్రోకో ఇందులో ఉందని చెబుతూ ఆయన మీద సీబీఐ 11 చార్జిషీట్లను దాఖలు చేసింది. ఆ కేసు ఇంకా విచారణ దశలోనే ఉంది. అయితే ఇప్పుడు జగన్ మీద కొత్తగా లిక్కర్ కేసుని తీసుకుని వస్తున్నారని వైసీపీ నేతలు అంటున్నారు. జగన్‌ని రాజకీయంగా బదనాం చేయడానికే ఈ కేసు అని అంటున్నారు. తాము కేసులకు భయపడేది లేదని మాజీ మంత్రులు పేర్ని నాని, అంబటి రాంబాబు వంటి వారు చెబుతున్నారు. మరో వైపు చూస్తే వైసీపీ అధినేత జగన్ సైతం జరుగుతున్న పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నారంటున్నారు. ఈ కేసులో వరస అరెస్టులతో ఆయన సైతం రానున్న పరిణామాలను గమనిస్తున్నారంటున్నారు. వీటి సంగతి పక్కన పెడితే జగన్ అరెస్టుకు ముహూర్తం ఖరారైందన్న వార్తలే ఇపుడు ఏపీ రాజకీయాల్లో కాక పుట్టిస్తున్నాయి. ఈ నెల 27, 28, 29 తేదీలలో కడప జిల్లా కమలాపురంలో టీడీపీ మహానాడు ఉంది. ఆ మహానాడుకు ముందే జగన్‌ని అరెస్ట్ చేస్తే క్యాడర్‌లో ఫుల్ జోష్ వస్తుందని అంటున్నారంట. అయితే అదే సమయంలో జగన్ సొంత జిల్లాలో మహానాడు జరుగుతోంది. అందువల్ల ఏమైనా ఇబ్బందులు మహానాడుకు ఈ అరెస్ట్ వల్ల వస్తాయేమో అన్న మరో కోణంలో కూడా కొందరు ఆలోచన చేస్తున్నారంట.



## ఎడిటోరియల్

ఇలా జగన్ అరెస్టు మహనాడు ముందా.. తరువాత.. అనే చర్చ కూడా సాగుతోందంట. అయితే జగన్ అరెస్ట్ కచ్చితంగా ఇదే నెలలో ఉంటుందని స్పష్టంగా చెబుతున్న వారూ ఉన్నారు ఇంకో వైపు చూస్తే జగన్ అరెస్టుని బెంగళూరులోనే చేయాలని, అలా ఆయనను అక్కడ నుంచే విజయవాడ తీసుకుని రావాలని ఆలోచిస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఇక టైం విషయంలో కూడా ప్రచారం ఉంది. రాత్రి వేళలో అరెస్ట్ చేస్తారా లేక పొద్దు పొద్దునే అరెస్ట్ చేస్తారా అనేది కూడా వేడెక్కించే చర్చగానే ఉంది. ఇకా డేట్ టైం ప్లేస్ అని ఫిక్స్ చేసుకుని అరెస్టుని రంగం సిద్ధం చేస్తున్నారంటున్నారు. అయితే లిక్కర్ స్కాం కేసులో ఈ రోజుకీ సరైన అధారాలు లేవని, జగన్‌ని ఎలా అరెస్ట్ చేస్తారని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు చూస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జూన్ 12 నాటికి ఏడాది పూర్తి అవుతుంది. ఈ లోగా జగన్ అరెస్ట్ చేయడం ద్వారా రానున్న నాలుగేళ్లలో ఏపీ రాజకీయాలను మలుపు తిప్పేలా చూడాలన్నది ఒక ఎత్తుగడగా చెబుతున్నారు. మొత్తానికి జగన్ అరెస్ట్ అనివార్యమని సోషల్ మీడియా నుంచి ఇతర సామాజిక మాధ్యమాలతో పాటు రాజకీయ వర్గాలలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.

## తిరంగా ర్యాలీ విజయవంతం



**పులివెందుల, మే 19 (జనస్వరం) :** పట్టణంలో సోమవారం నిర్వహించిన తిరంగా ర్యాలీ విజయవంతమైంది. దేశ సైనికుల పోరాటానికి మద్దతుగా కూటమి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి వరకు పూలంగళ్ల వరకు కొనసాగింది. ర్యాలీలో జై భారత్.. భారత్ మాతాకి జై అన్న నినాదాలు మార్మ్రోగాయి. నియోజకవర్గ పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడంతో పులివెందుల పట్టణం పోటెత్తింది. ఆపరేషన్ సింధూర్ పురస్కరించుకుని పాక్ ఉగ్రవాదులు, ఉగ్రవాద శిబిరాలపై సైన్యం విరుచుకుపడింది. వాటిని మట్టు పెట్టడంలో సైన్యం ఘన విజయం సాధించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని దేశ సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు కూటమి నాయకులు వెల్లడించారు.


## దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి అమానుషం



**పులివెందుల, మే 19 (జనస్వరం) :** విద్యార్థి జేమ్స్‌పై దాడి అమానుషమని వైసీపీ తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు అగ్రహారం రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో ఇంజనీరింగ్ చదువుతున్న జేమ్స్ అనే దళిత విద్యార్థిని అదే కళాశాలలో జూనియర్ అయినటువంటి అగ్రకులస్తుడు కులం పేరుతో దూషిస్తూ బంధించి చిత్రహింసలకు గురి చేస్తూ డ్రాయర్ నోట్లో కుక్కి, మూత్రం పోసి హింసించిన సంఘటన తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ప్రతిరోజు దళితులపై ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. పోలీస్ స్టేషన్లకు వెళితే న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోవడమే కాకుండా ఫిర్యాదు దారుల మీద కేసులు పెడుతూ చాలా ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందని తెలిపారు. జేమ్స్ మీద దాడి జరిగి గంటలు గడుస్తున్న మందకృష్ణ మాదిగ స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వైసీపీ తరపున రవి డిమాండ్ చేశారు.

## సామినేని విశ్వనాథం జీవితం ఆదర్శనీయం

**ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను**



**జగ్గయ్యపేట, మే 19 (జనస్వరం) :** నిబద్ధత, క్రమశిక్షణ గల నాయకుడిగా పేట ప్రాంత ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న గొప్ప వ్యక్తి సర్దార్ సామినేని విశ్వనాథం అని పలువురు రాజకీయ నాయకులు అన్నారు. సర్దార్ సామినేని విశ్వనాథం జయంతిని పురస్కరించుకొని స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి అలాగే ఎస్‌జిఎస్ కళాశాలలో ఉన్న విగ్రహానికి ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను, విశ్వనాథం అభిమానులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామినేని ఉదయభాను మాట్లాడుతూ నిబద్ధతకు, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచినటువంటి సామినేని విశ్వనాథం ఆశయసాధనలో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి అకుంఠిత దీక్ష తో ముందుకు పోయే విశ్వనాథం జగ్గయ్యపేట ప్రాంతా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ముఖ్యంగా పట్టణానికి తాగునీటి పైపులైన్ వ్యవస్థ, విద్యుత్తు, ఫైర్ సర్వీసు, సహకార సంఘాలు తదితర అనేక సంస్కరణలు చేపట్టి జగ్గయ్యపేట అభివృద్ధికి పునాదులు వేశారని తెలిపారు. అనంతరం బస్టాండ్ సమీపంలో కాంస్య విగ్రహం వద్ద విశ్వనాథం జయంతి సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేసి మజ్జిగ పంపిణీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సామినేని విశ్వనాథం అభిమానులు, సానుభూతి పరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "తాట తీయడానికైనా సిద్ధం"

**తిరంగా ర్యాలీతో కూటమి దేశభక్తి జ్వాలలు**




**చిత్తూరు, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** దేశాన్ని ఉద్దేశించి పాకిస్తాన్ చేసిన దుష్ప్రయత్నానికి ప్రతిగా భారత త్రిదళ బలగాలు చేపట్టిన "ఆపరేషన్ సింధూర్" విజయం సాధించిన సందర్భంగా కూటమి పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా దేశభక్తి భావాలు వెల్లివిరుస్తున్నాయి. ప్రతి నియోజకవర్గంలో తిరంగా ర్యాలీలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించగా, చిత్తూరులోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బస్ స్టాండ్ వరకు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేశ్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆధ్వర్యం వహించగా, కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు. దేశ భద్రతను తక్కువ అంచనా వేసిన పాకిస్తాన్‌కు భారత సైన్యం ధీటైన బుద్ధి చెప్పిందని నేతలు పేర్కొన్నారు. "హద్దు దాటి వచ్చిన వారికి తాట తీస్తాం. ఎవరికైనా ధీటుగా సమాధానం చెబుతాం. మన జవానుల వెన్నంటే దేశం అంతా ఉంది," అంటూ దేశ భక్తి సందేశాలు గల ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీ కొనసాగింది. దేశానికి దెబ్బతీయాలనే ప్రయత్నంలో పాకిస్తాన్ పిరికిపందంగా వ్యవహరించిందని, వారి కుట్రలను త్రిదల బలగాలు భగ్నం చేశాయని నాయకులు స్పష్టం చేశారు. "ఇది నవ భారతం.. ఓపికను పోగొట్టుకున్న దేశం" అని నేతలు పేర్కొన్నారు. దేశ భద్రత విషయంలో ఇక సహించేది లేదని ప్రధాని నరేంద్ర మోదీ నెల రోజుల్లో సమర్థవంతంగా ఇచ్చిన కౌంటర్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఆపరేషన్ సింధూర్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళి నాయక్, ఇతర జవాన్లకు నివాళులర్పించుతూ, రక్త తర్పణం వృథా కాదని కూటమి స్పష్టం చేసింది. జాతి గౌరవానికి భంగం కలిగిస్తే ఎలాంటి కఠిన నిర్ణయానికైనా దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని వారు పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని కొనియాడుతూ, యువతలో దేశభక్తిని నింపే నాయకుడు అంటూ ప్రశంసలు వెల్లువెత్తాయి. ఆయన వ్యాఖ్యలను వక్రీకరించే సూడో సెక్యులర్ నాయకులు సిగ్గుపడాలని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజినల్ కోఆర్డినేటర్ దారం అనిత మాట్లాడుతూ, "దేశ గౌరవం కాపాడే విషయంలో కూటమి ప్రభుత్వం, ప్రజలు ఒక్కటే. తల్లుల సింధూరాన్ని కాపాడటంలో మనం అన్ని విధాలా ముందుంటాం," అని పేర్కొన్నారు.

## నీలం సంజీవ రెడ్డి గొప్ప పరిపాలనా దక్షుడు

**మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి**



**పులివెందుల, మే 19 (జనస్వరం) :** స్వర్గీయ నీలం సంజీవ రెడ్డి గొప్ప పరిపాలనా దక్షుడు, నీతికి, నిర్భీతికి నిలువుటద్దామని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి కొనియాడారు. సంజీవ రెడ్డి జయంతిని సోమవారం వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ సంజీవ రెడ్డీ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని నాలుగేళ్ళు జైలు జీవితం గడిపాడన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా అనేక పదవులు అలంకరించి గొప్ప పరిపాలనా దక్షుడు అనిపించుకున్నారన్నారు. ఏపీసీసీ అధ్యక్షునిగా, ఏఐసీసీ అధ్యక్షునిగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. స్వయం కృషి, స్వీయ ప్రతిభతో ఒక సామాన్యుడు మాన్యుడు, అసామాన్యుడు కాగలడని, రైతు బిడ్డ రాష్ట్రపతి కాగలడని, పల్లెటూరి వాసి డిల్లీ నేత కాగలడని సంజీవ రెడ్డి నిరూపించారని వెల్లడించారు. బస్సు రూట్ల విషయంలో సుప్రీం కోర్టు ప్రభుత్వానికి ప్రతికూలంగా వ్యాఖ్యలు చేసినందుకు ముఖ్య మంత్రి పదవికి రాజీనామా చేసి రాజకీయాలలో నైతిక విలువలకు పెద్దపీట వేసిన నీతిమంతుడు అన్నారు. శ్రీశైలం డ్యాం, నాగార్జున సాగర్, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సంజీవ రెడ్డి మానస పుత్రికలు. ఔషధ మొక్కల్లో శ్రేష్టం సంజీవినీ మొక్క. రాజకీయ నాయకులలో శ్రేష్ఠుడు సంజీవ రెడ్డి అని అన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకం, స్ఫూర్తిదాయకమని తులసి రెడ్డి అన్నారు. సంజీవ రెడ్డికి భారత రత్న ప్రదానం చేయాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామ కృష్ణ, వెంకటేష్, మహబూబ్ బాషా, రామాంజనేయ రెడ్డి, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగ రాజు, రమణ, వినయ్, బద్రి, వేమయ్య, వేమా రాజా, మదార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారికి మైసూర్ రాజమాత వెండి అఖండాలు బహుకరణ



**పులివెందుల, మే 19 (జనస్వరం) :** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారికి మైసూరు రాజమాత ప్రమోదా దేవి రెండు భారీ వెండి అఖండాల (అఖండ దీపాలు)ను సోమవారం బహుకరించారు. ఈ అఖండాలు గర్భగుడిలో వెలిగించే సంప్రదాయ దీపాలు సుమారు 300 సంవత్సరాల క్రితం అప్పటి మైసూరు మహా రాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించినట్లు చరిత్రలో ఉంది. ఇప్పుడు మళ్లీ మైసూరు రాజమాత వాటిని సమర్పించడం విశేషం. ఒక్కో వెండి అఖండం సుమారు 50 కిలోల బరువుంటుంది. తిరుమలలోని రంగనాయకుల మండపంలో ఆమె ఈ భారీ వెండి అఖండాలను అందించారు. కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్. నాయుడు, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరిలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సుజనా చౌదరి కొలుకుంటున్నారు

**పరామర్శించిన జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష దంపతులు**



**హైదరాబాద్, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష దంపతులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితుల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల లండన్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడిన సుజనా చౌదరి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంలో సుజనా చౌదరి తిరుపతి అనూష, సురేష్‌లను నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ లోన్స్ గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు.

## యురేనియం టైలింగ్ పాండ్ అనర్థాలపై బిటెక్ రవిని కలిసిన గ్రామస్తులు



**పులివెందుల, మే 19 (జనస్వరం) :** నియోజకవర్గంలోని వేముల మండలానికి చెందిన తుమ్మలపల్లి గ్రామ పరిధిలోని యురేనియం టైలింగ్ పాండ్ వల్ల తీవ్ర అనర్థాలు సంభవిస్తున్నాయని బాధితులు స్థానిక టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డిని (బిటెక్ రవి) సోమవారం కోరారు. యురేనియం ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీనాథ్ రెడ్డి నేతృత్వంలో గ్రామస్తులు టీడీపీ కార్యాలయానికి చేరుకుని తమ వేదనను తెలియజేశారు. టైలింగ్ పాండ్ వల్ల పచ్చని పంటలు పూర్తిగా నాశనమవుతున్నాయని, సాగునీరు, తాగునీరు పూర్తిగా కలుషితమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తమ భూములు కోల్పోయిన తమకు కనీసం ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న డిమాండ్‌ను బిటెక్ రవి ముందుంచారు. "ప్రతికూల పరిస్థితుల్లో జీవనాధారం కోల్పోయిన మా కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోవాలి. నష్టపరిహారం అందించాలని కోరుతున్నాం" అని గ్రామస్తులు స్పష్టం చేశారు. గ్రామస్థుల విజ్ఞప్తిని గమనించిన బిటెక్ రవి, "మీ సమస్యల పట్ల నేను పూర్తిగా సహానుభూతితో ఉన్నాను. రేపు ఉదయం అధికారులతో కలిసి టైలింగ్ పాండ్ ప్రాంగణాన్ని పరిశీలిస్తాను. ఆపై మీరు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తాను" అని హామీ ఇచ్చారు. గ్రామస్తుల సమస్యలపై బిటెక్ రవి వెంటనే స్పందించడంతో వారికి కొంత ఊరట లభించింది. ఈ పరిణామాలు పులివెందుల నియోజకవర్గంలో యురేనియం ప్రాజెక్టుతో ముడిపడిన పర్యావరణ, జీవనోపాధి సమస్యలు మళ్లీ కేంద్రంగా వచ్చాయి.

# ఆర్.వి నగర్ నుండి సీలేరు శిథిలవస్థ జాతీయ రహదారి రోడ్డు

**- చలించిన పోలీసు శాఖ**

**- చింతపల్లి డివిజన్ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా, జీకే వీధి సీఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో మరమ్మత్త పనులు ప్రారంభం**



**చింతపల్లి/జీకే వీధి, మే 19 (జనస్వరం) :** జీకే వీధి మండలంలోని ఆర్వి నగర్ గ్రామం నుండి గూడెం కొత్త వీధి, సప్పర్ల, దార కొండ మీదుగా సీలేరు వరకు వెళ్లే ప్రధాన రహదారి తీవ్ర అధ్వానంగా తయారై వాహనదారులకు ప్రయాణికులకు ప్రమాదాలకు కారణంగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడి తీవ్రంగా దెబ్బతిని శిధిల స్థితికి చేరింది. ఈ రహదారి శిథిలావస్థ కు చేరి పెద్ద పెద్ద గోతులు ఏర్పడిన కారణంగా ప్రజలు వాహనదారులు ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా విషయం గమనించి చింతపల్లి ఏఎస్పీ నవ జ్యోతి మిశ్రా చలించి జీకే వీధి సీఐ వరప్రసాద్ ఎస్ఐ అప్పల్ సూరి ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మత్తు పనులను ప్రారంభించారు. ఈ దారిలో ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే అనేక వర్గాలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. ప్రజల వినతుల మేరకు స్పందించిన చింతపల్లి సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పి) నవజ్యోతి మిశ్రా స్వయంగా మరమ్మత్తు పనులనుల స్థలానికి చేరుకుని రహదారి పరిస్థితిని పరిశీలించారు. ఆయన ఆధ్వర్యంలో తాత్కాలికంగా మరమ్మత్తు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారి అయిన ఇది పరిసర గ్రామాల ప్రజలకు జీవనాడిలా మారింది. ప్రస్తుతం శిధిలమైన రహదారి వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకే తక్షణ చర్యలతో మురుగు నీరు పారిపోయేలా ఏర్పాటు చేసి, గుంతలను మట్టి,రాళ్లతో నింపి రహదారిని ప్రయాణయోగ్యంగా మార్చే పనులను ప్రారంభించాం. త్వరితగతిన పూర్తి స్థాయి మరమ్మత్తులు చేయడానికి సంబంధిత శాఖలతో సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రాంతీయ ప్రజలు ఈ చర్యపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, అధికారులు స్పందించడంపై అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీ.కే వీధి ఎస్సై అప్పల సూరి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెంకటగిరిలో అక్రమ నిర్మాణంపై జీహెచ్ఎంసీ చర్య

**ఇంటిని పాక్షికంగా కూల్చివేత**



**హైదరాబాద్, మే 19 (జనస్వరం) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన యూసుఫ్‌గూడ డివిజన్‌లోని వెంకటగిరిలో జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం ఉదయం అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టారు. సర్కిల్ 19 పరిధిలోని వాటర్ ట్యాంక్ ఎదురుగా ఉన్న ఒక సందులో నిర్మాణంలో ఉన్న ఇంటిని, అనుమతులు లేకుండా నిర్మించడాన్ని గుర్తించిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం, పోలీస్ బందోబస్తు మధ్య పాక్షికంగా కూల్చివేసింది. ఈ సందర్భంగా సర్కిల్ 19 ఏసీపీ ప్రసిద్ధ మాట్లాడుతూ, ప్రజలు ఇళ్ల నిర్మాణం ప్రారంభించే ముందు అవసరమైన అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాత నిర్మాణం చేపడితే ఇలాంటి విచక్షణలేని చర్యలు అవసరం ఉండవని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ తీవ్రంగా స్పందిస్తోందని, అవసరమైతే మరిన్ని ఇలాంటివి కూల్చివేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

# బ్రౌన్ పరిశోదనా భవనానికి శంకుస్థాపన



**పులివెందుల, మే 19 (జనస్వరం) :** కడప నగరంలోని యర్రముక్కపల్లి వద్ద సీపీ బ్రౌన్ గ్రంథాలయం, భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో నూతన భవన నిర్మాణానికి జిల్లా ఇంచార్జి మంత్రి సవిత చేతుల మీదుగా సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి, పోలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైబ్రరీలోని పుస్తకాలు, లూయిా లీప్, మెల్ల ప్రభ తలపత్ర గ్రంథాలను పరిశీలించారు. లైబ్రరీ నిర్వహణ, భాషా పరిశోధన కేంద్రం సౌకర్యాలు, పుస్తకాల రక్షణ, విద్యార్థులకు అందించాల్సిన సదుపాయాలపై అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించారు. విద్యార్థులకు, పాఠకులకు మెరుగైన వసతులు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, లైబ్రరీ కమిటీ సభ్యులు, భాషా పరిశోధన కేంద్ర ప్రతినిధులు పాల్గొని, కేంద్ర అభివృద్ధిపై తమ సూచనలు తెలిపారు.

# క్రాఫ్ హాలిడే పాటించండి

**ఆక్వా రైతుల హక్కులను సాధించండి : గాంధీ రాజు పిలుపు**





**పాలకొల్లు, మే 19 (జనస్వరం) :** ఆక్వా రైతులు క్రాప్ హాలిడే పాటించి ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు సహకరించాలని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అన్నారు. సోమవారం జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో చించినాడ గ్రామంలో ఆక్వా రైతులు క్రాఫ్ హాలిడేను పాటించాలని కోరుతూ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యలమంచిలి మండల పరిధిలోని చించినాడ, ఏనుగు వాని లంక, బాడవ, పోలవరం గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ సమస్యలను సంఘ అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజుకు వివరించారు. పంట విరామంపై ఆక్వా రైతులకు అవగాహన కలిగించారు. ఆక్వా సాగుకు పంట గ్రామం పాటించేందుకు రైతులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో ఆక్వా రైతులు పాల్గొన్నారు

# యలమంచిలి ఎంపీపీగా ఇనుకొండ ధనలక్ష్మి

**- అభినందనలు తెలియజేసిన నరసాపురం**

**మాజీ ఎమ్మెల్యే ముదునూరి, ఎమ్మెల్సీ కవురు, వైసీపీ ఇంచార్జ్ గుడాల గోపి**





**యలమంచిలి, మే 19 (జనస్వరం) :** పాలకొల్లు నియోజకవర్గంలోని యలమంచిలి మండల పరి షత్ ఎన్నికలు సోమవారం సజావుగా నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులు మేరకు మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి డ్వామా పిడి. డాక్టర్ కెసిహెచ్. అప్పారావు పర్యవేక్షణలో ఎంపీపీ ఎన్నికలను నిర్వహించారు. వైసీపీ ఎంపీటీసీ సభ్యులు 12 మంది హాజరు కాగా ఏనుగు వానీ లంక ఎంపీటీసీ ఇ నుకొండ ధనలక్ష్మిని ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి, డాక్టర్ అప్పా రావు, ఎంపీడీఓ ప్రేమాన్వితలు ఎంపీపీ నియామక పత్రాన్ని ధనలక్ష్మికి అందజేశారు. అనంతరం ఎంపీపీ ధనలక్ష్మిని నరసాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద్ రాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పాలకొల్లు నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి గుడాల శ్రీహరి గోపాల రావు (గోపి), రాష్ట్ర పంచా యతీరాజ్ ప్రధాన కార్యదర్శి యడ్ల తాతాజీ, వైసీపీ రాష్ట్ర నాయకులు, చిలుకూరి కుమార్ దత్తాత్రేయ వర్మ, వైసీపీ మండల అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ రాజు మాట్లాడుతూ మాది వైసీపీ 3 రంగుల పార్టీ అని మూడు పార్టీల కూటమి ప్రభుత్వం కాదన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన ఎంపీటీసీలను కూటమి ప్రభుత్వం చేసిన ప్రలోభాలకు తాము లొంగమని నిరూపించారు. ఈ కార్యక్రమంలో చెల్లెం ఆనంద ప్రకాష్, పాలకొల్లు జడ్పీటీసీ నడపన గోవింద రాజులు, నాయుడు, పోత్తూరీ బుచ్చిరాజు, పాలకొల్లు పట్టణ వైసీపీ అధ్యక్షులు కోరాడ శ్రీనివాస్, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుందరయ్య ఆశయ సాధనకు అంకితమవుదాం

**విఆర్‌పురంలో వర్ధంతి వేడుకలు**



**విఆర్ పురం, మే 19 (జనస్వరం) :** దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి బడిపిల్లిగా నిలిచిన మహానేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని వీఆర్‌పురం మండలంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ సెంటర్‌లో ఉన్న సుందరయ్య స్థూపం వద్ద సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ నేత కుంజా నాగిరెడ్డి చేతుల మీదుగా పార్టీ జెండాను ఆవిష్కరించి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. అనంతరం రేకపల్లి గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో పలు రాజకీయ నాయకులు పాల్గొన్నారు. సభలో మాట్లాడిన మండల పార్టీ కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, "పుచ్చలపల్లి సుందరయ్య ఒక ఆదర్శ కమ్యూనిస్టు. ఆస్తులను త్యాగం చేసి పేదల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు. యువతరం ఆయన ఆశయాలను తెలుసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలి," అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, ఎంపీపీ కారం లక్ష్మి, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ కారం బుచ్చమ్మ, వెట్టి లక్ష్మి, మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, వడ్లాది రమేష్, కమ్మసిచ్చు సత్యనారాయణ, చీరపు తాతబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, జల్లి సత్యనారాయణ, పులి బొజ్జి, కాంతారావు, రాజు, ప్రకాష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. సభలో సుందరయ్య త్యాగాలు, ఆయన రాజకీయ జీవితం, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆయన పోషించిన పాత్రను వివిధ నాయకులు వివరించారు. కార్యక్రమం ముగింపులో సుందరయ్య ఆశయాలను కొనసాగించాలని ప్రతిజ్ఞ తీసుకున్నారు.

# శ్రీశైలం ఆలయం చీఫ్ సెక్యూరిటీ అధికారిపై సస్పెన్షన్ వేటు



**శ్రీశైలం, మే 19 (జనస్వరం) :** శ్రీశైలభ్రమరాంభ మల్లికార్జున స్వామివార్ల సన్నిధానంలో పది రోజు ల క్రితం ఆలయానికి ఇతర మతస్థుల రాకతో వారి వద్ద లభ్యమైన అన్యమత పుస్తకాలు ఘటన వెలుగులోకి రావడంతో ఈవో చర్యలు చేపట్టారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్ఓ) అయ్యన్నపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు సస్పెన్షన్ వేటు వేశారు. సీఎస్ఓగా ఉద్యోగ బాధ్యతల పట్ల అయ్యన్న నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో ఈవో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే, సుమారు పది రోజుల క్రితం, ఇతర మతాలకు చెందిన కొందరు వ్యక్తులు ఆలయ సందర్శన కోసం వచ్చారని తెలిసింది. ఆ సమయంలో వారి వద్ద అన్యమతానికి సంబంధించిన పుస్తకాలు ఉన్నట్లు క్యూ లైన్ల వద్ద భద్రతా సిబ్బంది గుర్తించారు. దీంతో సిబ్బంది వారిని అక్కడి నుంచి వెనక్కి పంపిం చారు. అయితే, ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇతర మతస్థులు శ్రీశైలంలో కలకలం సృష్టించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అదేవిధంగా దేవాదాయ ధర్మాదాయ శాఖా నిబంధనల ప్రకారం క్షేత్రంలోకి మద్యం, మాంసహారాలు పోలీసుల తనిఖీలలో పట్టుబడిన సంఘటనలు అనేకం ఈ పరిణామాల నేపథ్యంలో, భద్రతాపరమైన అంశాల్లో సీఎస్ఓ అయ్యన్న నిర్లక్ష్యంగా ఉన్నారని భావించిన ఈఓ శ్రీనివాసరావు, ఆయనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఘటనపై తదుపరి విచారణ జరిపే అవకాశం ఉంది. అయ్యన్నతో పాటుగా ఇద్దరు భద్రతా సిబ్బందిని ఇద్దరు హోంగార్డులను కూడా సస్పెండ్ చేసినట్లుగా సమాచారం.

# మల్లన్న సేవలో తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క



**శ్రీశైలం, మే 19 (జనస్వరం) :** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామివార్ల దర్శనార్థమై సోమ వారం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రి సీతక్కకు ఆలయ అధికారులు, అర్చక వేదపం డితులు ఆలయ సంప్రదాయంలో భాగంగా స్వాగతం పలికారు. వీరు మల్లికార్జునస్వామి వారికి విశేష రుద్రాభిషేకం, శ్రీభ్రమరాంబదేవికి విశేష కుంకుమార్చనాది విశేష పూజలు నిర్వహించుకు న్నారు. పూజల అనంతరం ఆలయ సంప్రదాయంలో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో మంత్రి సీతక్కకు అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు వల్లించగా ఆలయ అధికారులు స్వామి వార్ల శేషవస్త్రాలను, స్వామివార్ల జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**- మృతదేహం వద్ద బోరున విలపించిన కుమార్తెలు**

**- విషాదఛాయలతో నిండిన పెంటపాడు గ్రామం**



**చింతపల్లి, మే 19 (జనస్వరం) :** పెంటపాడు గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ నల్లాల చంద్రరావు (38) ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ దుర్ఘటన చింతపల్లి–నర్సీపట్నం ప్రధాన రహదారిపై రౌరింతాడ గ్రామ సమీపంలోని జాతీయ రహదారి మలుపు వద్ద చోటుచేసుకుంది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగానే గ్రామమంతా శోకసంద్రంగా మారింది. చంద్రరావు ఇద్దరు కుమార్తెలు మృతదేహం వద్ద బోరున విలపించడంతో అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయం కలతకు గురైంది. కన్నీటి సాక్షిగా అంతిమ చూపు కోసం సమీప బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు భారీగా హాజరయ్యారు. ఇటువంటి విషాదకర సంఘటన పగవాడికి కూడా జరగకూడదని గ్రామస్థులు కంటతడి పెట్టారు. చంద్రరావు ఆకస్మిక మృతిపై చింతపల్లి నర్సీపట్నం బైక్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు మాకిరెడ్డి అప్పారావు, సభ్యులు, గ్రామ పెద్దలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, మృతుని పిల్లల భవిష్యత్తును ప్రభుత్వం తన భుజాలపై తీసుకోవాలని కోరుతున్నారు.

# నేటి నుంచి 24 వరకు ఎఫ్ఎల్ఎన్‌పై శిక్షణ



**బొంరాస్‌పేట, మే 19 (జనస్వరం) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి 24 వరకు 5 రోజుల వరకు మండల పరిధిలోని ఎస్జీటీ, పీఎస్హెచ్ఎం ప్రధానోపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి హరిలాల్ అన్నారు. శిక్షణ ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

# సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి



**బొంరాస్‌పేట, మే 19 (జనస్వరం) :** దుద్యాల మండల కేంద్రంలో సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా నాయకుడు బుస్స చంద్రయ్య సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడే 10 లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంపిణీ చేసిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాములు, నర్సయ్య, శ్రీనివాస్, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

# 30లోపు బుద్ధ విగ్రహం పునఃప్రతిష్ఠించాలి

**అంబేద్కర్ యువజన సంఘం**



**ముథోల్, మే 19 (జనస్వరం) :** బోరిగాం గ్రామంలో గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఈ నెల 30 లోపు పునఃప్రతిష్ఠించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అంబేద్కర్ యువజన సంఘం నేతలు హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు దళిత బహుజన ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 12న వైశాఖ బుద్ధ పూర్ణిమ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం, భారతీయ బౌద్ధ మహాసభ, రమాబాయి మహిళా సంఘం, మాల మహానాడు ఆధ్వర్యంలో బోరిగాం గ్రామంలోని ప్రభుత్వ భూమి (సర్వే నం. 249)లోని 1 ఎకరాలో బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పంచశీల జెండాలు ఎగురవేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అయితే అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అమృత భర్త ఎర్రం మురళి, కల్లెడ సాయిరెడ్డి, ఓని హనుమాన్లు దాడికి దిగారని, మహిళలు, కార్యకర్తలపై రాళ్లతో, కర్రలతో దాడి చేశారని సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ దాడిలో కొందరు మహిళలు గాయపడి బైంసా, నిజామాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి మాల మహానాడు ప్రతినిధి విట్టల్ కాంబ్లే, మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌లను అరెస్టు చేసి జిల్లా సబ్ జైలుకు తరలించారు. గ్రామంలో ఇప్పటికీ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని జిల్లా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బత్తుల రంజిత్ తెలిపారు. "ఇదే గ్రామంలో ప్రభుత్వ భూమిలో 4 ఎకరాలలో హనుమాన్ విగ్రహం స్థాపించబడింది. అది తొలగించకపోయినప్పుడు బుద్ధ విగ్రహాన్ని ఎందుకు తొలగించారు?" అంటూ అధికారులు, ప్రభుత్వం తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. బుద్ధుడి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించడమే కాకుండా, దాడిలో పాల్గొన్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి, ఎలుగు గంగాధర్, కిరణ్, భూమేష్, ఆకుల రమేష్, భీమ్ ఆర్మీ నాయకులు జంగమ్ సహాబ్ రావు, రాళ్ల బోరిగాం గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

WWW.JANASWARAM.COM

జనస్వరం

# పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి: రామాంజనేయులు




**కైకలూరు, మే 19 (జనస్వరం) :** తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థుల భవిష్యత్తు వారి మాతృభాష అయిన తెలుగు మాధ్యమంలోనే ఉండాలని, పాఠశాల ల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని డీపీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్య క్షులు డెమోక్రటిక్ జీవీఎస్ రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలుగు మాధ్యమం ద్వారా విద్య నేర్చుకున్న విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని సులభంగా గ్రహించగలరని, దేశంలోని పలువురు ప్రముఖ మేధావులు, న్యాయమూర్తులు, రాజకీయ నాయ కులు కూడా మాతృ భాషలో విద్య ప్రాధాన్యతను ఎన్నోసార్లు తెలిపారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి. రమణ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు వంటి ప్రముఖులు ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేశారని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రానికి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ఒక సభలో "ఎన్ని జన్మలెత్తినా తెలుగు వాడి గానే పుడతాను" అని చెప్పిన విషయాన్ని రామాంజనేయులు గుర్తు చేస్తూ, ఈ అభి మానం కేవలం మాటలకే పరిమితం కాకుండా విద్యారంగంలోనూ ప్రత్యక్షంగా కనబడాలన్నారు. తమిళనాడు, కర్ణాటక, ఒడిశా వంటి రాష్ట్రాల్లో స్థానిక భాషల్లోనే విద్యను కొనసాగిస్తున్నారని, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం తెలుగు మాధ్యమాన్ని వెనక్కి నెట్టడం నిందనీయమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాల ల్లో చదువుతున్న పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, వారి పట్ల ఈ విధంగా అన్యాయం చేయడం సరికాదన్నారు. ఖర్చులు లేని ఈ నిర్ణయాన్ని అత్యవసరంగా పునఃపరిశీలించాలని, పాఠ శాలల స్థాయిలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకో వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# కైకలూరు వైస్ ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకున్న కూటమి



**కైకలూరు, మే 19 (జనస్వరం) :** కైకలూరు మండలంలో ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ–1 స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గంగుల వెంకట నరసమ్మ విజయం సాధించారు. ఈ ఎన్నికను ఆర్డీఓ అచ్యుత అంబరీష్ అధ్యక్షతన నిర్వహించారు. మొత్తం 18 మంది ఎంపీటీసీ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా 10 మంది ఎంపీటీసీలు తామరకొల్లు టీడీపీ ఎంపీటీసీ గంగుల వెంకట నరసమ్మకు మద్దతు తెలపగా, వైసీపీ తరఫున 8 మంది ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. తగిన బలమైన మద్దతు లేకపోవడంతో కూటమి అభ్యర్థిని విజయిగా ప్రకటిం చారు. ఈ ఎన్నికను జాయింట్ కలెక్టర్ రాత్రి రెడ్డి పర్యవేక్షించారు. కూటమి విజయం నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు కూటమి నేతలు గంగుల వెంకట నర సమ్మను వైస్ ఎంపీపీ పదవికి అధికారికంగా సమర్పించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ విజయం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్, "నాయకత్వం అనేది వ్యక్తి నడవడిక, సత్ప్రవర్తన, అర్హతల ఆధారంగా ఉండాలి. ఒకరికి పదవి ఇచ్చి, అంతా కుటుంబమే నిర్వహించడం అనేది సముచితంకాదు. ఏ నేతను ఏ పదవిలో నియమించినా, వారికి పూర్తి హక్కులు ఇవ్వాలి. అలంకార ప్రాయమైన పదవులు సృజించడం ద్వారా వారిని కూర్చోబెట్టి హక్కులు హరిస్తే, అది నిజమైన నాయకత్వం కాదు" అని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీగా ఎన్నికైన గంగుల వెంకట నరసమ్మకు కూటమి నాయకులు, కార్యకర్తలు హర్షాతి రేకాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# లోకాకళ్యాణార్థం.. స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవసేవ..



**శ్రీశైలం, మే 19 (జనస్వరం) :** శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామివార్ల సన్నిధిలో దేవస్థానం నిర్వహిస్తున్న కైంకర్యాలలో భాగంగా సోమవారం సాయంత్రం ఉభయ దేవాలయాల ప్రాంగణం లో స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవసేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెండిరథాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగా సుందరంగా అలంకరించి స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంలోకి ఆశీనులను చేసి తదుపరి విశేషపూజలు నిర్వహించి కళ్యాణభరితంగా ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ వెండిరథోత్సవసేవలో కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, అర్చక, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

# బండలాగు పోటీల విజేతలకు బహుమతులు అందజేత

**ఘనంగా ముగిసిన కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు**



**నెల్లూరు, మే 19 (జనస్వరం) :** జిల్లాలోని సీతారాంపురం మండలం సంగసానిపల్లి పల్లి గ్రామం లో గత ఐదు రోజుల నుండి జరుగుతున్న శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎడ్ల బండ లాగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీ లు హొరాహోరీగా సాగాయి. అనంతరంఎడ్ల చే బండలాగు పోటీల్లో గెలుపొందిన విజేతలకు వెంగల శెట్టి వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు ప్రథమ బహుమతి పి వీరస్వామి చౌదరి రూ.50000, ద్వితీయ బహుమతి వీరస్వామి చౌదరి రూ.30000, తృతీయ బహుమతి లాక్కు నాగ శివశంకర్ రూ.20000లకు బహుమతు లు అందజేశారు. ఈ బండలాగు పోటీలు తిలకించేందుకు మండల పరిధిలోని ప్రజలుఅధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో వెంగళ శెట్టి వెంకటేశ్వర్లు, ముత్తం శెట్టి చెన్నకేశవులు, చింతల శ్రీనివాసులు, కానాల సిద్దయ్య, పిడుగు రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభకు విశేష ఫలితాలు



**నంద్యాల, మే 19 (జనస్వరం) :** పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ అయిన శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల 2022–25 అకడమిక్ బ్యాచ్ తృతీయ సంవత్సరం డిగ్రీ ఫలితాల్లో ఘన విజయం సాధిం చింది. కళాశాల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు తరపున నియమించబడిన అకడమిక్ అబ్జర్వర్ డాక్టర్ ఎన్.టి.కె.నాయక్‌లు సోమవారం ఈ ఫలితాలను సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, మొత్తం 629 మంది విద్యార్థులు డిగ్రీ తృతీయ సంవత్స రం పరీక్షలకు హాజరవ్వగా, వారిలో 540 మంది ఉత్తీర్ణులయ్యా రని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో 134 మంది డిస్టింక్షన్, 337 మంది ప్రథమ శ్రేణి, 69 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులై నట్లు వెల్లడించారు. కళాశాల మొత్తం ఉత్తీర్ణత శాతం 85.85గా నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం కళాశాల టాపర్లుగా జె. సంజీవ లహరి 94.17 శాతం మార్కులతో ప్రథమ స్థానం, షేక్ బిజాన్ 89.63 శాతంతో ద్వితీయ స్థానం, సయ్యద్ ఫరీద్ 89.45 శాతంతో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ ముగ్గురు టాపర్లను కళాశాల యాజమాన్యం అభినందించింది. నాలుగు దశాబ్దాలుగా కళాశాల నాణ్యమైన విద్యను అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ వస్తోందని, ఇది ఛైర్మన్ అంకితభావంతో పాటు అధ్యాపక బృందం కృషికి నిదర్శనమని డాక్టర్ జి. రామ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల పరీక్షల నిర్వహణ అధికారి కేబీవీ సుబ్బయ్య మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం వివిధ కోర్సుల ఫలితాలను వివరించారు. బి.ఏ కోర్సులో 81.82 శాతం, బి.కామ్ (జనరల్)లో 65.22 శాతం, బి.కామ్ (కంప్యూ టర్ అప్లికేషన్)లో 86.46 శాతం, బి.ఎస్సి (ఎంపీసీఎస్)లో 79. 03 శాతం, బి.ఎస్సి (ఎంఎస్‌సీఎస్)లో 81.48 శాతం, బి.ఎస్సి (ఎంఈసీఎస్)లో 64.29 శాతం, బి.ఎస్సి (బిజెడ్‌సి)లో 83.33 శాతం, బి.ఎస్సి (జెడ్‌సీసీఎస్)లో 88.89 శాతం, బి.ఎస్సి (బిజెడ్ సీసీ)లో 92.5 శాతం, బి.బి.ఏలో 90.91 శాతం, బి.సి.ఏలో 90.26 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. ఇంతమందిలో అనేక మంది విద్యార్థులు డిస్టింక్షన్ మార్కులతో ఉత్తీర్ణులయ్యారని, ముఖ్యంగా బి.సి.ఏలో 38 మంది, బి.కామ్ (సి.ఏ)లో 21 మంది, బి.ఎస్సి కోర్సుల్లో సుమారు 67 మంది వరకు డిస్టింక్షన్ సాధిం చారని వివరించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం విజేతలను హృదయపూర్వకం గా అభినందించింది. వారి భవిష్యత్తు విజయాల కోసం శుభాకా ంక్షలు తెలియజేశారు. విద్యారంగంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచడం తమ కళాశాల ప్రధాన లక్ష్యమని కళాశాల డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ఏ.ఎస్. ప్రగతి రెడ్డి, ఉప పరీక్షల నిర్వహణ అధికారులుగా డాక్టర్ యు.వి.ఎస్. కుమార్, ఎస్.వెంకట్ రావు, అధ్యాపకులు కె.సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి

**- ఘోర రోడ్డు ప్రమాదం నేపథ్యంగా హైవే నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన చింతపల్లి ద సబ్ డివిజన్ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా**



**చింతపల్లి, మే 19 (జనస్వరం) :** మండలంలోని ఆదివారం మధ్యాహ్నం రౌరింతాడ వద్ద చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం ప్రజలను కలచివేసింది. ఈ నేపథ్యంలో వాహనదారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా అన్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నందున ప్రమాదాల నివారణకు తగు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రాచలం నుండి విశాఖపట్నం వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు రౌరింతాడ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెంటపాడు గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ నల్లాల చంద్రరావు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అతని భార్య కృష్ణవేణి, అన్నయ్య కుమారుడు అఖిలేష్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఏఎస్పీ, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకో వాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో చింతపల్లి సీఐ ఎం.వినోద్ బాబు, జాతీయ రహ దారి నిర్మాణ సూపర్వైజర్ తిలక్‌లతో కలిసి ఏ ఎస్ పి నవజ్యోతి మిశ్రా అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. హైవే పనులు జరుగుతున్న ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన ప్రమాద కరమైన మలుపులు, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, అవసరమైన లైటింగ్ వంటి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రోడ్లు తడిసి ప్రమాదకరంగా మారుతున్నాయని, వాహనదారులు అధిక జాగ్రత్త తీసుకోవాలని సూచిం చారు. డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడప రాదని హెచ్చరించారు. అంతేగాక, ఒకే వాహనంలో ముగ్గురు ప్రయాణించడం, అతివేగంగా నడప డం, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడడం వంటి ఉల్లంఘనలు చేస్తే సీసీ కెమెరా ఆధారంగా లేదా పోలీస్ సిబ్బంది గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

**భక్తులరద్దీ దృష్ట్యా ఉభయదేవాలయాలలో ఆర్జితసేవలు రద్దు**



**శ్రీశైలం, మే 19 (జనస్వరం) :** శ్రీశైలభ్రమరాంభమల్లికార్జునస్వామివార్ల సన్నిధి భక్తుల రద్దీతో కళ కళలాడుతుంది. మహాశివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు సోమవారం కావడంతో క్షేత్రంలో భక్తులు రద్దీ పెరిగింది. క్షేత్రమంత భక్తజనంతో శ్రీశైలం పురవీధుల్లో సందడి వాతావరణం నెలకొంది. తెలుగు రాష్ట్రాల నుండి కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుండి సైతం భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి తరలివచ్చారు. భక్తులరద్దీ దృష్ట్యా ఉభయదేవాలయాలలో సోమవారం ఆర్జిత సేవ లు రద్దు పరచినట్లు కార్యనిర్వాహణాధికారి తెలిపారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దర్శనార్థమై శీఘ్ర, ఆతిశీఘ్ర, ప్రత్యేక క్యూలైన్లలో, కంపార్టుమెంట్లలో భక్తులు బారులు తీరారు. ఆలయ అధికా రులు భక్తులకు సౌకర్యవంతముగా స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకునే వీలును కల్పించారు. శ్రీ స్వామి అమ్మవారి ఉచిత దర్శనానికి సుమారు 3 గంటలు, శ్రీస్వామివారి స్పర్శ దర్శనానికి గంట సమయం పడుతుందని ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ క్యూలైన్లలో భక్తు లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకునేలా ఆలయ కార్య నిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టి భక్తులకు అల్పాహా రం, పాలు, బిస్కెట్స్, మంచినీరు అందజేస్తున్నారు.

# పశువుల యజమానుల నిర్లక్ష్యం

**మరోసారి పశువు ప్రాణం తీసింది**



**చింతపల్లి, మే 19 (జనస్వరం) :** మండల కేంద్రం లోని సెంటెన్స్ పాఠశాల మొదటి గేట్ సమీపంలోని జాతీయ రహదారిపై గత రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రహ దారిపై నిద్రిస్తున్న పశువుపై ద్విచక్ర వాహనం అదు పుతప్పి బలంగా ఢీకొనడంతో, అంతర్ల గ్రామానికి చెందిన గెమ్మెలి సుబ్బారావుకు చెందిన పశువు అక్కడి కక్కడే మృతి చెందింది. ఈ ఘటనలో వాహనదా రుడు స్వల్పంగా గాయపడినట్టు సమాచారం. రాత్రిపూట ప్రధాన రహదారులపై పశువులు స్వేచ్ఛగా సంచరించడం, నిద్రించడం ఇప్పుడిప్పుడే సాధారణంగా మారుతోంది. పశువుల యజమానులు వాటిని గోశాలలో ఉంచకుండా రహదారుల పక్కన వదిలేయడంతో రాకపోకలు సాగిస్తున్న వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత నెల ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా కూడా ఇదే తరహా ఘటన చోటుచేసుకుంది. జాతరకు హాజరైన ఓ ప్రేక్షకుడు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా, రహదారిపై నిద్రిస్తున్న పశువును ఢీకొట్టి తీవ్రంగా గాయపడగా, పశువు అక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పశువుల యజమానులు తమ బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉన్నదని స్థానికులు సూచిస్తున్నారు. పశు వులను గోశాలలలోనే ఉంచి, రహదారులపైకి వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు పశు సంరక్షణ శాఖ, రవాణా శాఖ, పోలీస్ శాఖల సమన్వయంతో చర్యలు తీసుకొని ఇటువంటి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని వాహనదారులు, ప్రయాణికులు, సామాజిక కార్యక ర్తలు డిమాండ్ చేస్తున్నారు.

# పులివెందులలో 'ఆపరేషన్ సిందూర్'కు సంఘీభావంగా తిరంగా ర్యాలీ



**పులివెందుల, మే 20 (జనస్వరం) :** విజయవంతంగా ముగిసిన "ఆపరేషన్ సిందూర్" సందర్భంగా భారత త్రివిధ దళాలకు సంఘీభావం ప్రకటిస్తూ, పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి), మారెడ్డి లతా రెడ్డి నాయకత్వం వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి పూల అంగళ్ల సర్కిల్ వరకు సాగిన ఈ ర్యాలీలో బీటెక్ రవి, లతా రెడ్డి త్రివర్ణ పతాకాన్ని చేతబట్టుకుని పాల్గొ న్నారు. పాకిస్తాన్ ఆధారిత ఉగ్రవాదాన్ని నిర్మూలించిన భారత త్రివిధ దళాలకు కృతజ్ఞతలు తెలియ జేస్తూ, వారి వీరోచిత పోరాటానికి, సేవలకు సంఘీభావంగా ఈ యాత్రను నిర్వహించామని ర్యాలీ లో నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మార్క్ ఫైడ్ డైరెక్టర్ శశిభూషణ్ రెడ్డి, వేంపల్లె మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, టీబీ హెల్సి ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై దేశభక్తిని ప్రదర్శించారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి



**యలమంచిలి, మే 19 (జనస్వరం) :** సీపీఎం స్ఫూర్తి నేత, కమ్యూనిస్టు ఉద్యమ ధ్రువతారగా ప్రసిద్ధిగాంచిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. యలమంచిలి సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంఘటనను గౌరవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల రాజు మాట్లాడుతూ "పుచ్చలపల్లి సుందరయ్య ప్రజల కోసం తన పిల్లలను కూడా చూడకుండా జీవితాన్ని అంకితం చేశారు. ఆయన నిరాడంబర జీవితానికి ప్రతీక. పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన మొదటి ప్రతిపక్ష నాయకుడిగా చరిత్రలో నిలిచారు. దేశంలో అనేక సమస్యలపై లోతైన అవగాహనతో చర్చలు జరిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారు. తన సొంత భూమిని వందల ఎకరాల మేర ప్రజలకు పంచిపెట్టారు. సీపీఎం ఉద్యమ నిర్మాతగా, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం పాటుపడ్డ మహనీయుడు" అని కొనియాడారు. "సుందరయ్య ఆశయాల సాధన అనేది అన్ని రంగాలలో సమానావకాశాలు కలిగిన సమాజాన్ని నిర్మించడమే" అని చింతకాయల రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. రమణ, పి. జానకి, కూర్మా రావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# దుప్పుతూరులో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం



**యలమంచిలి, మే 19 (జనస్వరం) :** అచ్చుతాపురం మండలానికి చెందిన దుప్పుతూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ చిట్టి పైడితల్లమ్మ అమ్మవారి జాతర సందర్భంగా సోమవారం సాయంత్రం రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు గ్రామస్తులు శెట్టి చిరంజీవి, ప్రగడ కొండలరావు ఆర్థిక సహకారంతో నిర్వహించబడుతున్నాయి. కబడ్డీ పోటీలను శెట్టి చిరంజీవి, ప్రగడ కొండలరావు కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి టీము లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ముఖ్యంగా అనకాపల్లి, భీమిలి, వైజాగ్ వారియర్స్ జట్లు పోటీలను ఉత్సాహంగా ప్రారంభించాయి. తొలి మ్యాచ్‌లో అనకాపల్లి, వైజాగ్ వారియర్స్ జట్లు తలపడాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దేశం శెట్టి శంకర్రావు, మాజీ సర్పంచ్ ప్రగడ జూనియర్ నాగేశ్వరరావు, వైస్ సర్పంచ్ దేశం శెట్టి ఈశ్వరరావు, దేశం శెట్టి వెంకటరమణ, మాజీ పీఏసీఎస్ బ్యాంక్ ఛైర్మన్ శెట్టి నాగేశ్వరరావు, ప్రగడ తాతబాబు, దేశం శెట్టి కాసుబాబు, బద్ది వెంకటరమణ తదితర గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.

# “గరుడ వారధి” నిర్వహణ పట్టదా?

### మున్సిపల్ అధికారులకు బీజేపీ నేత నవీన్ సూటి ప్రశ్న

**తిరుపతి, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తిరుపతిలో విపరీతంగా పెరిగిన యాత్రికులు, ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్మింపజేసిన గరుడ వారధి ఫ్లై ఓవర్ నిర్వహణ మున్సిపల్ అధికారులకు, నిర్మాణ కాంట్రాక్టర్ కు పట్టదా? అని బీజేపీ సీనియర్ నేత, సామాజిక సేవాకర్త నవీన్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆయన తిరుపతి వీవీ మహల్ రోడ్డులోని తన కార్యాలయంలో ఫ్లైఓవర్ నిర్వహణపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నవీన్ కుమార్ మాట్లాడుతూ... ఫ్లై ఓవర్ పరిశీలిస్తే నిర్వహణ సక్రమంగా చేస్తున్నారా అనే అనుమానాలు నగర ప్రజలలో కలుగుతున్నాయన్నారు. గరుడ వారధి నిర్వహణ లోపం కారణంగా ట్రాఫిక్ సమస్యలతో యాత్రికులకు, నగర ప్రజలకు శాపంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి పవిత్రతను దృష్టిలో ఉంచుకొని యాత్రికుల, నగర ప్రజల సౌకర్యార్థం గరుడవారధికి పునాది రాయి వేశారని, హైదరాబాద్ “నెక్లెస్ రోడ్” తరహాలో విద్యుత్ దీప కాంతులతో దేదీప్యమానంగా ఉండాల్సిన గరుడ వారధి కళావిహీనంగా మారడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. గరుడ వారధి నిర్వహణ లోపం, అధికారుల నిర్లక్ష్యంపై సీఎం చంద్రబాబు నాయుడుకి లేఖ రాస్తానని నవీన్ పేర్కొన్నారు.



గరుడ వారధి 2019లో 694 కోట్లతో ప్రారంభమైందని, అందులో 600 కోట్లు ఫ్లైఓవర్‌కు, 90 కోట్లు స్మార్ట్ స్ట్రీట్స్, మెయింటెనెన్స్, కాలువల నిర్మాణం కోసం కేటాయించడం జరిగిందన్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రతి 2 సంవత్సరాలకోసారి రోడ్ అండ్ సేఫ్టీ ఆడిట్ జరిపించాల్సిన బాధ్యత టిటిడి, నగరపాలక సంస్థ, స్మార్ట్ సిటీ అధికారులపై ఉన్నా అలాంటి భద్రతా పరీక్షలు జరిగిన దాఖలాలు కనపడటం లేదన్నారు. అలా రోడ్ అండ్ సేఫ్టీ ఆడిట్ జరిగితే వాతావరణ మార్పుల కారణంగా వర్షాలు పడినప్పుడు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగినప్పుడు ఫ్లైఓవర్ నిర్మాణంలో ఏదైనా చిన్నచిన్న పొరపాట్లు ఉంటే గుర్తించి వెంటనే సరి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అయితే గరుడ వారధి ఫ్లైఓవర్ కింద ఉన్న లీలామహల్ నుంచి లక్ష్మీపురం, శంకరంబాడి సర్కిల్, పద్మావతి పురం పైభాగం వరకు ఉన్న జంక్షన్ల, డివైడర్ల బ్యూటిఫికేషన్ నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్ దే అయినా గాలికి వదిలేసారని మండిపడ్డారు. డివైడర్ల మెయింటెనెన్స్ సక్రమంగా లేకపోవడంతో కళావిహీనంగా దర్శనమిస్తుందన్నారు. గరుడ వారధి 5 సంవత్సరాల నిర్వహణ కోసం సుమారు 25 కోట్లతో అదే కాంట్రాక్టర్‌కు అప్పజెప్పడం అందులో కొంత నిధులు విడుదల చేయడం జరిగినా నిర్వహణ లోపం కారణంగా ట్రాఫిక్ సమస్య పెరగడం, నగర ప్రజలకు యాత్రికులకు శాపంగా మారిందన్నారు. తిరుపతిలో వర్షం పడితే గరుడ వారధి ఫ్లై ఓవర్ కింద ఉన్న ప్రాంతాలన్నీ చెరువులను తలపిస్తున్నాయని దానికి కారణం కాలువ నిర్మాణాలను చేపట్టకపోవడమే అన్నారు. టిటిడి – నగరపాలక సంస్థ – స్మార్ట్ సిటీ – గరుడ వారధి కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రకారం సర్టిఫికెట్ తీసుకొని 5 సంవత్సరాలు సక్రమంగా పూర్తి నిర్వహణ చేపట్టేలా ఆదేశాలిచ్చి ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా నగర ప్రజలలో అనుమానాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు.

## సిట్ దర్యాప్తు కారణంగా వైసీపీ నేతలు కడతడి పడుతున్నారు

### వర్ల రామయ్య ఘాటు వ్యాఖ్యలు



**మంగళగిరి, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** సిటి (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం) దుబాయిలో విచారణ జరపడం ప్రారంభిస్తే వైసీపీ నేతలపై భారీగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, అందుకే వారు ప్రజలను మభ్యపెట్టేందుకు పుంకాను పుంకాలు, అబద్ధాలు రాస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య హెచ్చరించారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడిన ఆయన, సిట్ దుబాయిలో విచారణ మొదలు పెడితే, అవినీతి గ్రస్తులు పారిపోతారని, తమ మద్దతుదారులకు అంతిమంగా న్యాయం సాధిస్తామని తెలిపారు. “మద్యం కుంభకోణంలో సిట్ లోతుగా దర్యాప్తు చేసి అన్ని అన్యాయాలకు పాల్పడిన వారిని శిక్షించాలి. దుబాయిలోకి బంగారం తరలించిన కేసులో కూడా సిట్ దర్యాప్తు చేపట్టాలి” అని వర్ల రామయ్య పేర్కొన్నారు. అతను జగన్ ప్రభుత్వం పాలనలో జరిగిన భారీ లిక్కర్ స్కాంను ప్రత్యేకంగా విశ్లేషించి, ఈ కేసులో వైసీపీ పెద్ద పెద్ద నేతలు, హస్తాలు భుజాలు తడుముకుంటున్నాయని, వారికి భయం కలిగిందని చెప్పాడు. “లిక్కర్ స్కామ్‌లో 3,200 కోట్ల రూపాయల అవినీతి చోటు చేసుకుంది. ఈ కేసులో దోషులందరూ చట్టానికి తలొగ్గాలి. అవినీతి చేయకపోతే ఎవరు భయపడతారు?” అని ప్రశ్నించాడు. అంతేకాకుండా, సిట్ విచారణలో బయటకు వచ్చే నిజాలు ప్రజలకు తెలియడంతో, వైసీపీ నాయకులు తమ పత్రికలు, ఛానల్స్ ద్వారా తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. “నిర్దోషులని కోర్టు ముందు నిరూపించుకోగలరు, కానీ పత్రికల్లో అబద్ధాలు ప్రచారం చేయడం ప్రజలను మోసపర్చడం” అని మండిపడ్డారు. వర్ల రామయ్య మరోసారి గుర్తు చేసుకున్నట్టు, అవినీతికి పాల్పడిన ఏ స్థాయి వ్యక్తినైనా చట్టం క్షమించదని, అవినీతి బాధితులకు న్యాయం చేయాలన్నది సిట్ దర్యాప్తు ప్రధాన లక్ష్యం అని చెప్పారు. “90 వేల కోట్ల లిక్కర్ వ్యాపారం నుండి 18 వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని సమాచారం. ఇది అంతర్జాతీయ స్థాయిలో దర్యాప్తు చేయాల్సిన స్కామ్” అని ఆయన అభిప్రాయపడ్డారు. చివరగా, వర్ల రామయ్య మాట్లాడుతూ, “చంద్రబాబు నాయుడు పాలనలో పారదర్శక విధానాలతో ప్రభుత్వ కార్యకలాపాలు జరుగుతున్నాయి, అందుకే ప్రజల నమ్మకం పెరిగింది” అని పేర్కొన్నారు.

## చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహానాడుకు భారీగా తరలివెళ్ళిన తెలుగు తమ్ముళ్లు



**నెల్లూరు, మే 19 (జనస్వరం) :** జిల్లాలోని వింజమూరులో జరిగిన ఉదయగిరి నియోజకవర్గ మహానాడు కార్యక్రమానికి సీతారామపురం మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ముందుగా సీతారామపురం బస్టాండ్ కూడలి నుంచి కార్లలో బసినేనిపల్లి వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం మహానాడు కార్యక్రమానికి బయలుదేరారు. ఈ సందర్భంగా చింతల శ్రీనివాసులు మాట్లాడుతూ సీతారామపురం మండలంలో టీడీపీని పటిష్టంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీకి ఏ అవసరం వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. రాబోయే ఐదు సంవత్సరాలలో సీతారామపురాన్ని టీడీపీకి కంచుకోటగా నిలుపుతానన్నారు. టీడీపీకి చెందిన నాయకులకు గానీ, కార్యకర్తలకు గానీ ఏ సమస్య ఉన్న ఎల్లవేళలా నన్ను సంప్రదించవచ్చన్నారు. రాబోవు ఎన్నికల్లో కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని, తద్వారా ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించుకోవాలన్నారు. టీడీపీ గెలుపు కొరకు ప్రతి ఒక్కరు కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, ముత్తంశెట్టి చెన్నకేశవులు, నేలటూరి జాషువా, జెసి ఇజ్రాయిల్, కానాల సిద్ధయ్య, పిడుగు రమేష్, పసుపులేటి వికాస్ (విక్కీ), ముత్తూరు సుమన్, కల్లూరి జయరామిరెడ్డి, తురక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## మంత్రి కందుల దుర్గేష్‌కు ఏలూరులో ఘన స్వాగతం



**ఏలూరు, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** అంబికా సంస్థల వ్యవస్థాపకులు ఆలపాటి రామ చంద్రరావు శత జయంతి మహోత్సవాల నిమిత్తంగా ఏలూరుకు వచ్చిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కి వై.ఎం.హెచ్.ఏ. హాల్ వద్ద ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పలనాయుడు స్వయంగా మంత్రి దుర్గేష్‌ను ఆహ్వానించి సత్కరించారు. కార్యక్రమం లో జనసేన పార్టీకి చెందిన పలువురు ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జన సైనికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**సాంస్కృతిక నేపథ్యం – మహోత్సవాలకు ప్రాధాన్యం :**

అలపాటి రామచంద్రరావు శత జయంతి మహోత్సవాలు ఏలూరు ప్రజలకే కాదు, తెలుగు ప్రజలందరికీ గర్వకారణంగా నిలుస్తున్నాయని నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి నేతల హాజరుతో ఏలూరు మరింత సాంస్కృతిక భరితంగా మారింది. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, “తెలుగు సంస్కృతిని, వారసత్వాన్ని పరిరక్షించడమే తన తొలి కర్తవ్యంగా భావిస్తున్నానని, అలాంటి మహానుభావుల జయంతులు జెండా పతాకాలుగా జరుపుకోవడం సమాజానికి ఆదర్శం” అని పేర్కొన్నారు.

## ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాల్లో నాటికల ధారాపాతం



**ఏలూరు, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** అంబికా సంస్థల వ్యవస్థాపకులు ఆలపాటి రామచంద్రరావు శత జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని, ఏలూరులో మే 17 నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి నాటికల పోటీలు ఘనంగా కొనసాగుతున్నాయి. హిందూ యువజన సంఘం (వై.ఎం.హెచ్.ఏ), అంబికా సంస్థలు, హేలాపురి కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో ఆదివారం (రెండవ రోజు) నాటికల ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి అంబికా కృష్ణ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మాజీ మంత్రి మరడాని రంగారావు, సినీ నటుడు బెల్లంకొండ శ్రీనివాస్, హిందూ యువజన సంఘం అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, కళారత్న కె.వి. సత్యనారాయణ, ఇరదల ముద్దుకృష్ణ, మజ్జి కాంతారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, “ఆలపాటి రామచంద్రరావు, వారి కుటుంబ సభ్యులు ఏలూరు అభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమైనది. వారి దౌత్యం, సేవా మనోభావం ప్రపంచ స్థాయిలో ఈ పట్టణానికి పేరు తీసుకువచ్చింది” అని పేర్కొన్నారు.

**నాటికల అలరింపు :**

రెండవ రోజు నాటికల పోటీలలో గోవాడ క్రియేషన్, హైదరాబాద్ వారు ప్రదర్శించిన “అమ్మ చెక్కిన బొమ్మ”, కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, గుడివాడ వారు ప్రదర్శించిన “ద్వారాబంధాల చంద్రయ్యనాయుడు” నాటికలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**గిడుగు పురస్కారం ప్రదానం :**

ఈ సందర్భంగా ప్రముఖ భాషా పరిశోధకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ గౌరవ ఫెలో ప్రొఫెసర్ డా. వెల్చేరు నారాయణరావుకు 11వ తానా–గిడుగు రామమూర్తి తెలుగు భాషా పురస్కారాన్ని తానా నాయకులు గొర్రిపాటి చందు మరియు వి.ఎల్.ఎం.ఆర్. వెంకటరావు లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, నాయకులు నారా శేషు, అంబికా ప్రసాద్, వేణు గోపాల్ లునాని, మోతే శ్రీనివాస నారాయణరావు, ఆర్.ఎన్.ఆర్. నాగేశ్వరరావు, ఎల్. వెంకటేశ్వరరావు, కె.బి. రావు, ఎస్. సురేష్, డా. లంకా వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ యాదవ్, మారం హనుమంతరావు, కానాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంబికా కుటుంబ సభ్యులు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమ సమన్వయ బాధ్యతలు మహమ్మద్ కాజావలి విజయవంతంగా నిర్వహించారు.

## పిఠాపురంలో క్రియాశీల సభ్యులకు కిట్ల పంపిణీ

### శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్ ఆధ్వర్యంలో 635 మందికి పంపిణీ



**పిఠాపురం, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మార్గదర్శకంలో పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చిత్రాడ గ్రామంలో జనసేన పార్టీ క్రియాశీల సభ్యులకు కిట్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. జూలై, ఆగస్టు నెలల్లో సభ్యత్వం పొందిన 635 మంది క్రియాశీల కార్యకర్తలకు ప్రత్యేకంగా ఈ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, నంద్యాల జాన్, బావిశెట్టి నంది, పిల్లి శ్రీనివాస్ లు సమన్వయంతో నిర్వహించారు. పార్టీకి కృషి చేసిన క్రియాశీల సభ్యుల జాబితా ఆధారంగా కిట్ల పంపిణీ చక్కగా సాగింది. ఈ సందర్భంగా పెంకే జగదీష్ మాట్లాడుతూ, “జనసేన పార్టీ ప్రజల కోసం కూటమి ప్రభుత్వంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లేలా మా ప్రయత్నం కొనసాగుతోంది. పిఠాపురం నియోజకవర్గం ఎప్పుడూ లేనివిధంగా అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా పవన్ కళ్యాణ్ ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతున్నారు,” అని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికంగా పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చైతన్యవంతంగా తీసుకెళ్లేందుకు కార్యాచరణను ముమ్మరం చేయనున్నట్లు పేర్కొన్నారు.

## పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విస్తృత పర్యటన



**పుట్టపర్తి, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మంగళవారం వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ముఖ్యంగా మహిళల సంక్షేమానికి జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను ప్రజలకు చేరవేయడంలో ఎమ్మెల్యే తీవ్ర శ్రద్ధ చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లమాడ మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు. రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ శిబిరంలో మహిళలకు 90 రోజుల పాటు ఉచితంగా టైలరింగ్ శిక్షణ అందజేయబడనుంది. శిక్షణ పూర్తయ్యాక, పాల్గొన్న వారికి ఉచిత కుట్టు మిషన్లు కూడా అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 10 గంటలకు వంకర కుంట చిన్నమ్మ పరిసర ప్రాంతాలలో పాల్గొంటారు. తదుపరి పుట్టపర్తి సాయి అరామం వద్ద ఉదయం 11:30 గంటలకు విద్యుత్ శాఖ అధికారులు నిర్వహించే సూర్య ఘర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. ఇక్కడినుండి పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని కర్ణాటక నాగేపల్లి గ్రామంలో జరిగే జాతరకు హాజరై, ఆ తరువాత మధ్యాహ్నం 2 గంటలకు పెడబల్లిలో జరిగే జాతరకు కూడా చురుకుగా పాల్గొననున్నారు. మధ్యాహ్నం 5 గంటలకు పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేరుకొని కార్యక్రమాన్ని ముగిస్తారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతుల స్వీకరణ



**మంగళగిరి, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ప్రముఖంగా ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి అనేక మంది అర్జీదారులు తరలివచ్చారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు నేరుగా అర్జీలు స్వీకరించి, వాటిపై పరిష్కారానికి కృషి చేశారు. ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం టి. లక్ష్మిరెడ్డి తన అర్జీలో 2019లో చేసిన సిమెంట్ రోడ్డు పనులకు సంబంధించిన బిల్లులు అందని పరిస్థితిని వివరించి, వాటిని అందజేయాలని కోరారు. అలాగే, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామంలోని గ్రామ కంఠ భూములను కొందరు ఆక్రమించుకున్నారని, ఆ విషయంపై అధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కుమ్మరి రామపుల్లయ్య అభ్యర్థించారు. విజయనగరం జిల్లా యాగాటి వరలక్ష్మి తన వారసత్వ భూమిని పక్కవారు ఆక్రమించి, శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని, ప్రభుత్వం ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండల కేంద్రంలో బీసీ విద్యార్థులకు వసతిగృహం ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ మద్దతు అందించాలని డి. శ్రీనివాసరావు కోరారు. కర్నూలు జిల్లా ఆధోని మండలం నారాయణపురం గ్రామానికి చెందిన మసాపురం అంజనయ్య రీ సర్వే సమయంలో తన భూమి మల్లేసప్ప కబ్జా చేశాడని, న్యాయం కల్పించాలని ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లా బివన్ కండ్రిక మండలం కల్లివెట్టు గ్రామ పరిధిలో 21 ఎకరాల అటవీ భూమిని కల్కి ట్రస్టువారి ఆక్రమించుకున్నారని, ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసి రక్షించాలని ఒంగోలు వాసి నార్నె వెంకటసుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై కుడుపూడి సత్తిబాబు తన వంతుగా పరిశీలన చేసి, త్వరలోనే సమస్యలకు తగిన పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు త్వరిత పరిష్కార మార్గాలు కనిపించి, ప్రజల సౌకర్యం కోసం కృషి చేస్తామని టీడీపీ నేతలు తెలిపారు.

## పుట్టపర్తిలో 22న టీడీపీ మినీ మహానాడు

### ఎమ్మెల్యే సింధూర రెడ్డి, ఎంపీ పార్థసారథి ముఖ్య అతిథులు



**పుట్టపర్తి, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** పుట్టపర్తి నియోజకవర్గం టీడీపీ ఆధ్వర్యంలో 22న స్థానిక టీడీపీ కార్యాలయంలో మినీ మహానాడు నిర్వహించనున్నారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఎంపీ డాక్టర్ పార్థసారథి, పార్టీ పరిశీలకులు, జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, రాష్ట్ర కమిటీ సభ్యులు, నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, టీడీపీ కుటుంబ సభ్యులు హాజరు కానున్నారు. ఈ మినీ మహానాడును పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పార్టీ ప్రవేశపెట్టనున్న తీర్మానాలపై సుదీర్ఘ చర్చలు జరగనున్నాయి. పార్టీ తరపున భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడి, పార్టీ అధిష్ఠానానికి పంపనున్నారు. అలాగే, పార్టీలో మరణించిన నేతల కుటుంబాలకు సంతాపం తెలియజేయడం, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికుల సేవలను స్మరించుకుంటూ మద్దతుగా నివాళులర్పించాలన్న తీర్మానాలను కూడా మినీ మహానాడులో ఆమోదించనున్నారు. ఈ సమావేశానికి పుట్టపర్తి నియోజకవర్గంలోని టిడిపి పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా నేతలు, టీడీపీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు.

## సర్వేపల్లిలో వైసీపీ పాలనలో మూతపడిన ఎస్సీ హాస్టల్

### పరిశీలించిన బొబ్బేపల్లి సురేష్ నాయుడు



**సర్వేపల్లి, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు సర్వేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉండే ప్రభుత్వ బాలుర వసతి గృహం అయిన ఎస్సీ హాస్టల్‌ను పరిశీలించారు. ఈ హాస్టల్ జడ్పీ హైస్కూల్‌కు ఆనుకొనగా, చుట్టుపక్కల గ్రామాలలోని పేద ఎస్సీ పిల్లలకు విద్యాభ్యాసానికి వసతులు అందించేది. గత ఐదు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వ పాలనలో ఈ హాస్టల్ పట్ల సరైన శ్రద్ధ చూపబడలేదు. అవసరమైన సదుపాయాలు లేకపోవడంతో పిల్లలు హాస్టల్‌లో ఉండలేకపోతున్నారని బొబ్బేపల్లి సురేష్ తెలిపారు. ఈ హాస్టల్‌లో విద్యార్థుల భద్రత కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు, దీనిపై గతంలో మాజీ శాసనసభ్యులు, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి దృష్టి పెట్టలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సొంత భవనం లేకపోవడంతో బాడుగ భవనంలో హాస్టల్ నిర్వహణ జరుగుతూ వందల మంది విద్యార్థులు మంచి చదువును పొందారని ఆయన గుర్తు చేశారు. అయితే, ప్రస్తుతం ఉన్న 8 గదుల ఉన్న ఈ భవనం పూర్తిగా శిథిలమైపోతోంది. కొందరు ఆకతాయిలు ఈ భవనాన్ని మందు తాగడం, పేకాటడే స్థలంగా వాడుతుండడం విశేష ఆందోళనకు కారణమైందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు, ఎస్సీ ఎస్టీ హాస్టల్లు అనియంత్రితంగా క్షీణిస్తున్నాయని, దానికి స్పందించకపోవడం దురదృష్టకరమని బొబ్బేపల్లి సురేష్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో, కూటమి భాగంగా జిల్లా కలెక్టర్ సహా సంబంధిత అధికారుల సమక్షంలో ఈ భవనాన్ని పరిశీలించి, దీనిని జూనియర్ కాలేజీ, ప్రభుత్వ వైద్యశాల లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయంగా మార్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ఈ విషయం తెలియజేస్తూ, నియోజకవర్గంలో ఇతర ప్రభుత్వ భవనాల పరిశీలన చేసి వాటిని సమర్థవంతంగా ఉపయోగించాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు శ్రీపై మల్లికార్జున్, మండల కార్యదర్శి సందూరి శ్రీహరి, సుబ్రహ్మణ్యం, ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, అశోక్, మస్తాన్, చిన్న, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ క్యాంపు కార్యాలయం ప్రారంభం



**ఉంగుటూరు, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** నియోజకవర్గంలోని నారాయణపురం గ్రామంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నిర్మించిన నూతన జనసేన పార్టీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సోమవారం పురస్కారమైన ఉత్సాహంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పౌరసరఫరాల శాఖ, ఏలూరు ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కోటికలపూడి గోవింద రావు, జనసేన ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, బొమ్మిడి నాయకర్, పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర ఆప్కాబ్ ఛైర్మెన్ గన్ని వీరాంజనేయులు, విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శులు చెనమళ్ళ చంద్రశేఖర్, కరాటం సాయి, డీసీఎంఎస్ ఛైర్మెన్ చాగంటి మురళీ కృష్ణ, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, మాకా ఈశ్వరయ్య, జుత్తిగ నాగరాజు, దొడ్డిగర్ల సువర్ణ రాజు, ఘంటశాల వెంకట లక్ష్మి, కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, నారా శేషు సహా అనేక పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రారంభంలో మంత్రి నాదెండ్ల మనోహర్ నూతన క్యాంపు కార్యాలయానికి సమీపంలోని ఆలయాల్లోని దేవతా మూర్తులను దర్శించి, ఆధ్యాత్మిక ఆశీస్సులు పొందారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించి, నియోజకవర్గ ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఏర్పాటు చేసిన ప్రత్యేక విందును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గం నుండి జనసేన, టిడిపి, బీజేపీ పార్టీ నేతలు, మండలాల, గ్రామాల అధ్యక్షులు, నాయకులు, మహిళా సంఘాలు, జనసైనికులు, ప్రజా ప్రతినిధులు సహా భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరై ఒకరితో ఒకరు అనుసంధానమై, రాష్ట్ర రాజకీయాల్లో కూటమి సామరస్యాన్ని ప్రతిబింబించారు

## నేడు, రేపు వర్షాలు

**విశాఖపట్నం, అమరావతి, మే 19 (జనస్వరం) :** తీవ్రమైన వడగాడ్పులతో అల్లాడిన రాష్ట్ర ప్రజలకు ఊరటనిచ్చేలా ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా కోస్తాంధ్రను ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకూ, మధ్యప్రదేశ్ నుంచి మరట్వాడా, కర్ణాటక మీదుగా రాయలసీమ వరకూ వేర్వేరుగా ఉపరితల ద్రోణులు విస్తరించాయి. వీటి ప్రభావంతో సముద్రం నుంచి వచ్చే తేమగాలులు, వాయువ్య భారతం నుంచి వీచే పొడిగాలుల కలయికతో రాష్ట్రంలో పలుచోట్ల సోమవారం ఉదయం ముసురు వాతావరణం నెలకొంది. తర్వాత పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. మంగళ, బుధవారాల్లో రాయలసీమలో పలుచోట్ల, కోస్తాలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.


**ఏయే జిల్లాల్లో.... :**

మంగళవారం బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, ఉభయగోదావరి, కొనసీమ,కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

**మరిన్ని ప్రాంతాలకు నైరుతి విస్తరణ :**


నైరుతి రుతుపవనాల విస్తరణకు అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో వాతావరణం అనుకూలంగా మారింది. రానున్న రెండు రోజుల్లో దక్షిణ బంగాళాఖాతం నుంచి ఈశాన్య బంగాళాఖాతం మధ్య గల మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి.కాగా, ఈనెల 21వ తేదీన కర్ణాటకకు ఆనుకుని అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో 22న తూర్పు మధ్య అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడి తర్వాత ఉత్తరంగా పయనిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. మే 27వ తేదీన కేరళను నైరుతి రుతుపవనాలు తాకుతాయి..

## సీబీఎన్ పాత్‌వేస్‌టు సక్సెస్ పుస్తకావిష్కరణ




**అమరావతి, మే 19 (జనస్వరం) :** ముఖ్యమంత్రి చంద్రబాబు 75 ఏళ్ల జీవిత ప్రస్థానాన్ని వివరిస్తూ ఐఐటీ మద్రాసు పూర్వ విద్యార్థి డి.రాజేశ్ కుమార్, రీచ్ ఎయిట్స్ ఈటీ అండ్ సీ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ డీఏ రాజు సంయుక్తంగా రాసిన 'సీబీఎన్ పాత్‌వేస్‌టు సక్సెస్' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. సచివాలయంలో సోమవారం ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకంలో సీఎం చంద్రబాబు జీవితాంశాలు, విజన్, విజయసూత్రాలు, అభివృద్ధి విధానాలు వంటి అంశాలను పొందుపరిచారు. కార్యక్రమంలో వీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ బన్ బాబు పాల్గొన్నారు.

## రెండో విడతలో హజ్‌కు 906 మంది



**అమరావతి, మే 19 (జనస్వరం) :** రాష్ట్ర హజ్ యాత్రికులందరికీ ఎలాంటి ఇబ్బందులూ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసి పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఏపీ నుంచి రెండవ విడతలో 906 మంది హజ్ యాత్రికులు హైదరాబాద్ ఎంబార్కేషన్ నుంచి సోమ, మంగళవారాల్లో మూడు విమానాల్లో జెడ్డాకు వెళుతున్నారు. వీరి కోసం ఏపీ మైనార్టీ మంత్రిత్వశాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లకడీకాపూల్‌లోని షా ఫంక్షన్ ప్లాజాలో ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మైనార్టీ సలహాదారు ఎంఏ షరీఫ్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా, హజ్ కమిటీ సభ్యులు తదితరులు జెండా ఊపి రెండో విడత హజ్‌యాత్రను ప్రారంభించారు. యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏపీ నుంచి మొత్తం 1630 మంది హజ్ యాత్రకు వెళ్తున్నట్టు తెలిపారు.

## పల్లా శ్రీనివాస్‌పై అన్ని పార్టీల మద్దతుతో

# న్యాయ పోరాటం కొనసాగిస్తా...

- ఎమ్మెల్యే పదవి నుంచి భర్తరఫ్ చేయాలి
- ఇది నా వ్యక్తిగత పోరాటం... టీడీపీకి సంబంధం లేదు
- ఈ పోరాటానికి అన్ని పార్టీల మద్దతు కోరుతున్నాను.
- తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్



**విశాఖపట్నం, మే 19 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌పై తాను వ్యక్తిగతంగా న్యాయపోరాటం చేస్తున్నానని, ఈ పోరాటానికి కాంగ్రెస్, వైసీపీ, సీపీఐ, సీపీఎం, లోక్సత్తా మొదలైన పార్టీల మద్దతు కోరుతున్నట్టు తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ తెలిపారు. న్యూ కాలనీలోని సింకా గ్రాండ్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ మద్దతు కోరినట్లు చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తే చంపేస్తామని గాజువాక టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారు. ఆయన మనుషులు నన్ను హత్య చేసేందుకు ప్రయత్నించారని, 100 మంది ఒకేసారి దాడి చేసి చంపే ప్రయత్నం చేశారన్నారు. గాజువాకలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదన్నారు. దీనిపై పోలీస్ కమిషనర్ను కలిశానని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. సీఎం చంద్రబాబుపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఆయన దీనిపై దృష్టి సారించి తనపై జరిగిన దాడిని ఖండించాలని, హోటల్‌లో జరిగిన దాడి సంఘటన వీడియో తెప్పించుకుని చూడాలని కోరారు. ఈ దాడి నా ఒక్కడి మీద జరిగింది కాదని, తెలుగు ప్రజలపై జరిగిన దాడిగా చూడాలన్నారు. పల్లా శ్రీనివాసరావు ఒక మాఫియాలా తయారయ్యాడని చెప్పారు. అతనిపై సీబీఐ, కేంద్ర హెూం మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశానన్నారు. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పల్లా శ్రీనివాస్ సీబీఐ దర్యాప్తు కోరుకోవాలన్నారు. ఎవరికీ భయపడనన్నారు, చివరిదాకా పోరాటం చేస్తానన్నారు. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమని భావించామని, అయితే టీడీపీ నాయకులు జగన్ కంటే అరాచకంగా తయారయ్యారన్నారు. శాంతియుతమైన విశాఖలో పల్లా శ్రీనివాసు అండ్ గ్యాంగ్, పల్లా కార్తీక్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వెనక్కుండి నడిపిస్తారని అనడం సరికాదన్నారు. పల్లా శ్రీనివాస్ దగ్గర ఉన్న మురళి అతని వ్యవహారాలన్నీ చూస్తారని, సెటిల్మెంట్లు, కలెక్షన్ అన్ని అతనే చేస్తారన్నారు. పల్లా శ్రీనివాసపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నన్నారు. ఎమ్మెల్యే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని సీఎంని కోరుతున్నామన్నారు. అన్ని పార్టీల మద్దతుతో న్యాయ పోరాటం కొనసాగిస్తానన్నారు. రక్షణ కోసం తాను పోలీస్ కమిషనర్ని గన్ లైసెన్స్ కూడా అడుగుతానని చెప్పారు.

## నాటి తప్పులకు.. నేడు శిక్ష

- ఉపాధి పథకంలో వైసీపీ ప్రభుత్వం పాపాలు
- మెటీరియల్ నిధుల కోసం ఒత్తిడి చేసి దొంగ మస్టర్లు
- ఇప్పుడు సోషల్ ఆడిట్ తనిఖీలతో సిబ్బంది విలవిల
- బాధ్యులైన వందల మందిపై వేటు..
- భారీగా రికవరీలు

**అమరావతి, మే 19 (జనస్వరం) :** గత వైసీపీ సర్కార్ ఉపాధి హామీ పథకం నిర్వహణలో చేసిన తప్పిదాలు ఇప్పుడు ఉపాధి సిబ్బంది ఉద్యోగాలకు చేటు తెస్తున్నాయి. మెటీరియల్ నిధుల కోసం సిబ్బందిపై ఒత్తిడి చేసి దొంగ మస్టర్లు వేయించిన ఫలితంగా ఇప్పుడు వారు ఉద్యోగాలు పోగొట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది. సోషల్ ఆడిట్ తనిఖీల్లో మస్టర్లకు సంబంధించిన పనులు క్షేత్రస్థాయిలో జరిగినట్లు కనిపించకపోవడంతో ఆ రికవరీని సిబ్బందిపై విధిస్తున్నారు. చెల్లించని కొంత మందిపై పోలీసు కేసులు కూడా నమోదవుతున్నాయి. ఒక్కో జిల్లాలో వందల మంది సిబ్బంది సస్పెండ్ అయి డ్వామా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో విచారణకు ఆదేశిస్తున్నారు. పత్రికల్లో కథనాలు, ఫిర్యాదుల మోతతో ఉపాధి అధికారులు తప్పనిసరిగా విచారణ చేపట్టి, రికవరీలు చేయాల్సి వస్తోంది. దీంతో సిబ్బంది ఇరుక్కుపోతున్నారు. అప్పటి ప్రభుత్వం తమపై ఒత్తిడి తెచ్చి మస్టర్లు వేయించిందని, ఒత్తిడి చేసిన అధికారులు ఇప్పుడు లేకపోవడం, ఒకవేళ ఉన్నా నిస్సహాయ స్థితిలో ఉండటంతో తాము బలవుతున్నామని వాపోతున్నారు.

**దొంగ మస్టర్లు వేయాలంటూ ఒత్తిళ్లు :**

గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా జరిగిన దాఖలాల్లేవు. మండల కార్యాలయాల్లో ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కంప్యూటర్ ముందు కూర్చొని మస్టర్లు నమోదు చేశారు. రాష్ట్రస్థాయి నుంచి టార్గెట్లు పెట్టి మరీ మస్టర్లు వేయించారు. కేంద్రం నుంచి మెటీరియల్ నిధులు రాబట్టుకునేందుకు లేబర్ కాంపోనెంట్ పెంచుకోవాలనే ప్రయత్నంలో భాగంగా దొంగ మస్టర్లు వేయించారు. దీంతో కూలీలు పనులకు వెళ్లకపోయినా వేతనాలు పడ్డాయి. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత కూడా అదే సిబ్బంది కొనసాగుతున్నారు. ఇప్పుడు కూడా గతంలానే మస్టర్లు వేయాల్సిన పరిస్థితి! దొంగ మస్టర్లు వేయకపోతే సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. అప్పట్లో వేసి, ఇప్పుడు ఎందుకు వేయరని నిలదీస్తున్న, గొడవకు దిగుతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పథకంలో లొసుగులు లేకుండా కట్టడి చేసేందుకు ఇప్పటికే సోషల్ ఆడిట్ డైరెక్టర్‌ను మార్చడంతో పాటు ఉపాధి పథకానికి చీఫ్ విజిలెన్స్ అధికారిగా పోలీసు శాఖకు చెందిన అదనపు ఎస్పీని నియమించారు.

**సోషల్ ఆడిట్ తనిఖీలతో విలవిల :**

గత ప్రభుత్వంలో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ బృందాలు ఇటీవల తనిఖీలు చేపట్టాయి. పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని సోషల్ ఆడిట్ డైరెక్టర్ శ్రీకాంత్ ఆదేశించారు. 2023-24, 2024-25ల్లో చేపట్టిన పనులకు సంబంధించి తనిఖీలు చేపట్టినప్పుడు.. ఫీల్డ్‌లో పనులు చేసిన ఆనవాళ్లు లేదు. దీంతో అప్పట్లో శ్రామికులకు చెల్లించిన మొత్తాన్ని ఉపాధి సిబ్బందిపై రికవరీ వేస్తున్నారు. ఒక్కో మండలంలో రూ.కోట్ల రికవరీలను సోషల్ ఆడిట్ మండల సభలో తేలుస్తున్నారు. దీంతో బాధ్యులైన సిబ్బందికి రికవరీలు వేయడం, ఉద్యోగాల నుంచి తొలగించడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. అప్పట్లో దొంగ మస్టర్లు చేయాలని ఒత్తిడి తెచ్చిన అధికారి గాని, వైసీపీ నేతలు గానీ ఇప్పుడు మొహం చాటేస్తున్నారు.

**డ్వామా, కమిషనరేట్ కార్యాలయం చుట్టూ సిబ్బంది :**

ఉద్యోగాలు కోల్పోయిన సిబ్బంది డ్వామా, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీలు ఫైనల్ కావడంతో జిల్లా విజిలెన్స్ అధికారులు మరోసారి ఆ పనులపై తనిఖీలకు ఆదేశించకుండా రికవరీలు విధిస్తున్నారు. దీంతో సిబ్బంది ఉద్యోగాలు కాపాడుకునేందుకు ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నారు. అప్పటి సర్కారే తమకు ఈదుస్థితి తీసుకొచ్చిందని నిందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తమ ఆవేదనను అర్థం అర్థం చేసుకుని, ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకుంటున్నారు. ఉద్యోగాలు పోయి రోడ్డున పడ్డామని, తమకు ఉద్యోగాలు తిరిగివ్వాలని కమిషనర్ కృష్ణతేజ, ఆయా డ్వామా పీడీలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మహిళల భద్రతకు శక్తి

- యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న 1.52 కోట్ల మంది
- రాష్ట్రంలో164 బృందాలు.. 900 చోట్ల నిఘా
- మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలే: డీజీపీ

**అమరావతి, మే 19 (జనస్వరం) :** రాష్ట్రంలో మహిళలపై నేరాలకు పాల్పడిన కేసుల్లో గత పది నెలల్లో 169 మందికి జైలుశిక్షలు పడ్డాయని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. ప్రతి మహిళ, బాలిక, చిన్నారికి అత్యంత భద్రత కల్పించేందుకు పోలీసు శాఖ పని చేస్తోందని సోమవారం వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 164 శక్తి బృందాలు ఏర్పాటు చేసి 900 స్పాట్‌లలో నిఘా విస్తృతం చేశామన్నారు. అధునాతన ఫ్యూచర్లతో రూపొందించిన శక్తి యాప్‌కు 1.52 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. 11.6 లక్షల కాల్స్ రాగా, అందులో అత్యవసరంగా స్పందించాల్సిన 34,192 ఫోన్లకు పోలీసులు సకాలంలో స్పందించినట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్ ఇచ్చి 90 శాతం సమస్యలు పరిష్కరించినట్టు, 3,193 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల భద్రత కోసం శక్తి బృందాలను మఫ్టీలో ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని, మహిళలపై జరిగే వ్యవస్థీకృత నేరాల కట్టడికి 'ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్' ఐజీ రాజకుమారి నేతృత్వంలో నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. నేరాల నుంచి తప్పించుకునేలా మహిళలకు 12,119 అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈవ్ టీజింగ్, అత్యాచారాలు, హత్యలు, గృహహింస, వరకట్న హత్యలు, లైంగిక వేధింపులు, దాడులు, దూషణలకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై చర్య తీసుకున్నట్లు తెలిపారు. మహిళలు, యువతులు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

AP POLICE
SHAKTHI
WOMEN & CHILD SAFETY

## 21 నుంచి 21 వరకు యోగాంధ్ర

### యోగా డేపై నెలపాటు విస్తృత ప్రచారం: సీఎస్

**అమరావతి, మే 19 (జనస్వరం) :** అంతర్జాతీయ యోగా దినోత్సవంలో రాష్ట్రంలోని రెండు కోట్ల మంది భాగస్వాములయ్యేలా చూడాలని, ఇందుకోసం మే 21 నుంచి జూన్ 21 వరకూ యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. యోగా డే నిర్వహణపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి సంబంధిత శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 21న విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో ప్రధాని మోదీ సమక్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఐదు లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గొంటారని, దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యోగా ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేయాలని, ఇందుకు కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దీనిపై మంగళవారం సర్క్యులర్ జారీ చేస్తామన్నారు. కాగా, దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని కోర్టు కాంప్లెక్సుల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. ఇందుకోసం రూ.50 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా యోగా డే నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకూ 'యోగాంధ్ర' పేరిట ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి 27 వరకూ ట్రైనింగ్ అండ్ ట్రైనర్స్ శిక్షణ ఇస్తామని, 28 నుంచి జూన్ 3 వరకూ మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ, జూన్ 4 నుంచి 16 వరకూ గ్రామ, వార్డు స్థాయిల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా వంద పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల్లో యోగా డే నిర్వహిస్తామన్నారు.

## శ్రీశైలం డ్యాంపై జలసంఘం కార్యాచరణ

- శాస్త్రవేత్త హనుమంతప్ప సారథ్యంలో ఐదుగురు రాక
- ఎల్లుండి వరకు అక్కడే అధ్యయనం

**అమరావతి, మే 19 (జనస్వరం) :** శ్రీశైలం జలాశయం వద్ద దెబ్బతిన్న అప్రోచ్ రోడ్, టెయిల్ ఎండ్ ప్రాజెక్టు, ప్లంజ్‌పూల్ పరిస్థితులపై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) కార్యాచరణ చేపట్టింది. ప్రముఖ సైంటిస్టు హనుమంతప్ప సారథ్యంలోని ఐదుగురు శాస్త్రవేత్తల బృందాన్ని సోమవా రం ప్రాజెక్టు వద్దకు పంపింది. ఈ బృందం గురువారం (22వ తేదీ) దాకా అక్కడే ఉండి అధ్యయనం చేస్తుంది. జలసంఘం అధ్యయనం కోసం రూ.50 లక్షలు మంజూరు చేయాలని జలవనరుల శాఖ గతంలో పదే పదే కోరినా ఆర్థిక శాఖ దాటవేస్తూ వచ్చింది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'ఆర్థిక శాఖతోనే అసలు పేచీ' శీర్షికన ప్రచురితమైన కథనంపై సీఎం చంద్రబాబు స్పందించడంతో ఆర్థిక శాఖ దిగొచ్చింది. గత శుక్రవారం రూ.50 లక్షలు విడుదల చేసిం ది. గతనెల 29, 30 తేదీల్లో జల సంఘం ఇంజనీర్ల బృందం, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎసఏ) చైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలోని బృందం శ్రీశైలం జలాశయం వద్ద పర్యటించాయి. ఇవి అధ్యయనం చేసేంతవరకు.. డ్యాం స్పిల్‌వే ముందు ఏర్పడిన భారీ గొయ్యిపైనే కేంద్ర రాష్ట్రాలు ఆందోళన చెందేవి. అయితే పైబృందాల అధ్యయనంలో.. దానికంటే పెను ప్రమాదం పొంచి ఉన్నట్లు తేలిం ది. డ్యాం పునాదుల వద్ద ఏర్పాటు చేసిన స్టీల్ సిలెండర్లు దెబ్బతినడం, ప్రాజెక్టు రాతి గోడలకు ఎలాంటి సిమెంట్ రివిటింగ్ లేకపోవడం, అప్రోచ్ రోడ్ దెబ్బతినడం, డ్యాంను అనుకుని ఉన్న కొండరాళ్లు కోతకు గురికావడం వంటివి బయట పడ్డాయి. తొలుత వీటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని.. లేదంటే ఆనకట్టకే భారీ ముప్పని అనిల్ జైన్ ఏకంగా జలవనరుల శాఖకు లేఖ రాశారు. దీంతో ప్రభుత్వం బిత్తరపోయింది. పునరుద్ధరణ చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టింది. ఈ క్రమంలోనే హనుమంతప్ప నేతృత్వంలో అధ్యయనం చేయనుంది.

## అసభ్య పోస్టులు పెడితే కఠిన చర్యలు

- మహిళా సాధికారతకు కృషి..
- మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా రాయపాటి శైలజ బాధ్యతలు స్వీకరణ



**అమరావతి, మంగళగిరి, మే 19 (జనస్వరం) :** 'మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేస్తూ, సమాజంలో మహిళలపై జరుగుతున్న వివిధ రకాల దాడులను, అఘాయిత్యాలను నిరోధించేందుకు నా వంతు కృషి చేస్తా' అని రాయపాటి శైలజ పేర్కొన్నారు. సోమవారం మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో చైర్ పర్సన్‌గా అధికారుల సమక్షంలో పదవీ ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'గతంలో మా వద్ద నమోదైన పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తా. అవసరమైతే వాటిని జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు సరైన న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తా. సోషల్ మీడియా వేదికగా ఎవరైనా మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే వారిపై శాఖాపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటాం. మహిళలు తమపై జరుగుతున్న దాడులను నేరుగా నా దృష్టికి తీసుకువచ్చేందుకు మా శాఖ ద్వారా నూతన వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్నాం. కూటమి ప్రభుత్వం నాపై ఎంతో నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తా. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తాను. బాధితులకు సత్వరమే న్యాయ పరిష్కారం చూపేందుకు కృషి చేస్తా' అని శైలజ తెలిపారు. ఈ సందర్భంగా కీలక బాధ్యతలు అప్పజెప్పిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రీ మారిటల్ కౌన్సెలింగ్ సెంటర్ల ఏర్పాటు ఫైలుపై చైర్‌పర్సన్ తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె కు... మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, భాష్యం రామకృష్ణ, వ్యాపార వేత్త రాయపాటి గోపాలకృష్ణ, రమేశ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రమేశ్ బాబు, టీడీపీ నేత శివ నాగమల్లేశ్వరరావు అభినందనలు తెలిపారు.